# మనసులో మాట

KANCHARLA

నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. | సంచలన తెలుగు దిన పత్రిక

## ఉత్తరాంధ్ర

| | | |
|---|---|---|
| విశాఖపట్నం | విజయనగరం | అనకాపల్లి |
| శ్రీకాకుళం | అల్లూరి జిల్లా (పాడేరు) | పార్వతీపురం |

ఆదివారం 31 మే 2026 పేజీలు 16




## విశాఖ నగరాభివృద్ధి కి రూ.1,500 కోట్ల ప్రాజెక్టులు

- విశాఖ నగర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరో భారీ అవకాశం
- దిశా సమావేశం అనంతరం మీడియాతోత మాట్లాడిన ఎంపీ శ్రీభరత్

**విశాఖ సిటీ.. మే30(మనసులో మాట):**

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.50 వేల కోట్ల అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద విశాఖపట్నానికి రూ.1,500 కోట్ల విలువైన మూడు కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు మంజూరయ్యాయని విశాఖపట్టణం ఎంపీ ఎం. శ్రీభరత్ తెలిపారు.

..మిగతా 2లో


## "స్వచ్ఛ ఆంధ్రకు మంత్రి సంధ్యారాణి మద్దతు"

### ఇంధన పొదుపుకు బైక్‌పై వచ్చి ఆదర్శంగా నిలిచిన మంత్రి గుమ్మడి



3





# కాలువ నీరే దిక్కు.. రాళ్లబాటలోనే ప్రయాణం!

- పి.మాకవరం పంచాయితీలో తాగునీరు, రహదారి సమస్యలతో అల్లాడుతున్న గిరిజనులు
- సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్, ఐటీడీఏ పీఓలకు విజ్ఞప్తి

**కొయ్యూరు, మే 30 (మనసులో మాట):**

అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం పి. మాకవరం పంచాయితీ పరిధిలోని రామచంద్రాపురం, చిన్నయ్య కొండ గ్రామాల్లో తాగునీటి, రహదారి సమస్యలు తీవ్రరూపం దాల్చాయి. సంవత్సరాలు గడుస్తున్నా తమకు మౌలిక వసతులు కరువయ్యాయని, పాలకులు మారుతున్నా తమ బతుకులు మారడం లేదని రెండు గ్రామాల గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**బురద నీరే జీవనాధారం.. 'జల జీవన్' పడకేసింది!**

ఈ రెండు గ్రామాల్లోని ప్రజలు తాగేందుకు, వంట వండుకునేందుకు, చివరకు నిత్య అవసరాలకు కూడా స్థానిక కాలువ నీటిపైనే ఆధారపడుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో వర్షాలు పడినప్పుడు కాలువ నీరు పూర్తిగా బురదమయంగా మారుతుందని, వేరే ప్రత్యామ్నాయం లేకపోవడంతో అదే కలుషిత నీటిని తాగాల్సి వస్తోందని వారు ఆవేదన చెందుతున్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జల జీవన్ మిషన్' పథకం ఇక్కడ పూర్తిగా అటకెక్కింది. ఐదు నెలల క్రితం ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తామని చెప్పి,

..మిగతా 5లో



## జిందాల్ మెగా ఇండస్ట్రియల్ పార్క్ శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలి

- రాష్ట్ర పరిశ్రమల శాఖ సెక్రటరీ యువరాజ్ ఆదేశం

**విజయనగరం, (మనసులో మాట) జిల్లా ప్రతినిధి, మే 30 :**

జిల్లాలోని ఎస్.కోట మండల పరిధిలో ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన "మెసర్స్ జేఎస్‌డబ్ల్యూ ఇండస్ట్రియల్ పార్క్ లిమిటెడ్ " (ప్రైవేట్ మెగా ఇండస్ట్రియల్ పార్క్ (మల్టీ యుటిలిటీ ఎంఎస్ఎంఈ పార్క్)) శంకుస్థాపనకు ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరితగతిన ఏర్పాట్లు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య శాఖ సెక్రటరీ డాక్టర్ ఎన్. యువరాజ్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ఆయన శనివారం అమరావతి నుంచి జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, జాయింట్

..మిగతా 11లో



## మహిళా సాధికారత కల్పనలో బ్రాండిక్స్ భేష్

### కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్

**అనకాపల్లి ప్రతినిధి /అచ్యుతాపురం, మే 30 (మనసులో మాట ):**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వస్త్ర పరిశ్రమ రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని, బ్రాండిక్స్ తరహాలో మరిన్ని పరిశ్రమలు ఇక్కడికి వస్తే పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభించడం తో పాటు రాష్ట్ర పారిశ్రామిక రంగానికి బలమైన ఊతం లభిస్తుందని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ అన్నారు. శనివారం అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్ లోని ప్రముఖ అంతర్జాతీయ వస్త్ర తయారీ సంస్థ 'బ్రాండిక్స్' ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థలో జరుగుతున్న వస్త్ర ఉత్పత్తుల తయారీ, అంతర్జాతీయ ఎగుమతులు, దిగుమతుల ప్రక్రియను బ్రాండిక్స్ ఇండియా డైరెక్టర్,

..మిగతా 2లో

# ప్రభుత్వంపై దుష్ప్రచారం సరికాదు : ఎంపీ కలిశెట్టి



**విజయనగరం, (మనసులో మాట) జిల్లా ప్రతినిధి, మే 30 :**

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థుల ఫలితాల మెరుగుదలే లక్ష్యంగా, ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతూ, రాష్ట్ర విద్యా రంగానికి బంగారు భవిష్యత్తును అందిస్తుంటే ఓర్వలేని కొంతమంది వ్యక్తులు దుష్ప్రచారం చేస్తున్నారని, ఇది సరికాదని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. శనివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపీ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, ఆధునిక విద్యా విధానాలు అమలు, ఉపాధ్యాయుల నియామకాలు, ఖాళీల భర్తీ వంటి కీలక చర్యలతో విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ ఉంటే, భారతదేశం అంతటా మన రాష్ట్ర విద్య విధానాన్ని మెచ్చుకుంటోందని తెలిపారు. ఈ నేపథ్యంలో జగన్మోహన్ రెడ్డి, ఆయన సమూహం అక్కసుతో ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. మంత్రి లోకేష్ కు వస్తున్న పేరు ప్రతిష్ఠలను ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని, ఇటువంటి దుష్ప్రచారన్ని

..మిగతా 7లో

# మహిళా సాధికారత కల్పనలో బ్రాండిక్స్ భేష్

(మొదటి పేజీ తరువాయి)

భారతీయ భాగస్వామి దొరస్వామి మంత్రికి క్షుణ్ణంగా వివరించారు. ఫ్యాక్టరీ అంతటా పర్యటించి కార్మికుల పని తీరును, వారికి కల్పిస్తున్న వసతులను పరిశీలించిన కేంద్రమంత్రి, యాజమాన్యం తీసుకుంటున్న శ్రద్ధను ప్రత్యేకంగా అభినందించారు.

**కోటి పెట్టుబడి కి 50 మందికి ఉపాధి**

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న ఏకైక రంగం టెక్స్‌టైల్స్ (జౌళి) మాత్రమేనని మంత్రి గిరిరాజ్ సింగ్ స్పష్టం చేశారు. గార్మెంట్ రంగానికి ఉన్న ఉపాధి సామర్థ్యంపై కీలక వ్యాఖ్యలు చేశారు. టెక్స్‌టైల్ రంగంలో పెట్టే ప్రతి 1 కోటి రూపాయలు పెట్టుబడికి సుమారు 50 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభిస్తుందని ఆయన వెల్లడించారు. బ్రాండిక్స్ వంటి భారీ పరిశ్రమల ఏర్పాటు వల్ల గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలు, యువతులు వేల సంఖ్యలో ఉద్యోగాలు సాధిస్తూ ఆర్థికంగా స్థిరపడుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. బ్రాండిక్స్ రాకతో ఈ ప్రాంతంలో మహిళా సాధికారత గణనీయంగా పెరిగిందని స్థానికులు తనకు స్వయంగా తెలిపారన్నారు. ఇంట్లో ఒక మహిళ ఆర్థికంగా బలోపేతమైతే ఆ కుటుంబమంతా వృద్ధి చెందుతుందన్నదే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ల ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

**టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగంలో సరికొత్త విప్లవం**

భవిష్యత్తు అంతా సాంకేతిక వస్త్రాల దేనని కేంద్ర మంత్రి చెప్పారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తో జరిగిన సమావేశంలో ఈ రంగం అభివృద్ధిపై తాము సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. ప్రస్తుతం సాధారణ దుస్తులతో పాటు ఏరోస్పేస్, డ్రోన్లు, రక్షణ, వైద్య, వ్యవసాయ రంగాలలో టెక్నికల్ టెక్స్‌టైల్స్ వినియోగం విపరీతంగా పెరుగుతోందని వివరించారు. ఈ సరికొత్త విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అపారమైన అవకాశాలు ఉన్నాయని, బ్రాండిక్స్ తరహాలో మరిన్ని పరిశ్రమలు ఇక్కడికి వస్తే పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభించడంతో పాటు రాష్ట్ర పారిశ్రామిక రంగానికి బలమైన ఊతం లభిస్తుందని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జౌళిశాఖ ఉన్నతాధికారులు, బ్రాండిక్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# సేవ దృక్పథంతో పని చేస్తే ఏ ఉద్యోకైన ప్రజల్లో గుర్తింపు



**చీడికాడ, మే 30, (మనసులో మాట)**

ఏ ఉద్యోగ అయిన తాను పనిచేసిన చోట సేవ ధృక్పదంతో పనిచేస్తే ప్రజల్లో గుర్తింపు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అన్నారు చీడికాడ ఎంపీడీగా పనిచేస్తున్న వేముల హేమ సుందర రావు ఈనెల 31న పదవి విరమణ చేస్తున్నారు ముందుగా చీడికాడ వైవిఆర్ ఫంక్షన్ హాల్ లో పంచాయతీ కార్యదర్శులు సచివాలయం సిబ్బంది వివిధ శాఖల అధికారులు ఎంపీడీవో వేముల హేమ సుందర రావుకు శనివారం వీడ్కోలు సభ నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు పాల్గొని ఎంపీడీవో హేమసుందరావును ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ మండల అభివృద్ధికి ఎంపీడీవో హేమసుందర్రావు రాజకీయాలు అతీతంగా సేవలు అందించారు అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ జయమ్మ మండల టిడిపి అధ్యక్షులు పోతల చిన్నంనాయుడు మాజీ ఎంపీపీ సింహాచలంనాయుడు డిప్యూటీ ఎంపీడీవోలు గుర్రం కోటేశ్వరరావు ప్రసన్ కుమార్ టిడిపి నాయకులు చిన్నంనాయుడు గండి ముసలి నాయుడు పైలా ముత్యాల నాయుడు పంచాయతీ కార్యదర్శులు వీఆర్పీలు విఆర్వోలు పాల్గొన్నారు

# మౌలిక వసతులతో పారిశ్రామిక అభివృద్ధికి కృషి : కలెక్టర్

- **జిల్లా పరిశ్రమల ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం**



**విశాఖసిటీ.. మే30( మనసులో మాట)**

రోడ్లు, విద్యుత్ సరఫరా, నీటి వసతి, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి సమష్టి కృషి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. ముఖ్యంగా సింగిల్ విండో డెస్క్ ద్వారా అనుమతులను సులభతరంగా, వేగవంతంగా మంజూరు చేయాలని నిర్దేశించారు. ఔత్సాహికులకు తగిన విధంగా సహాయ, సహకారాలు అందించాలని సూచించారు. కలెక్టరేట్ మీటింగు హాలులో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన జిల్లా పరిశ్రమల ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆయన పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించటంతో పాటు, అధికారులకు తగిన మార్గదర్శకాలు జారీ చేశారు. పెండింగ్‌లో ఉన్న పారిశ్రామిక అనుమతులు, భూ కేటాయింపులు, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. వివిధ పారిశ్రామిక పార్కుల్లో పెండింగ్‌లో ఉన్న అనుమతులు, సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తుల క్లియరెన్స్‌పై త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహకారం అందిస్తూ నిర్ణీత గడువులోగా అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు.

# మెగా డీఎస్సీ అవకతవకాలపై ఆందోళన జయప్రదం చేయండి

**మునగపాక, మే 30, మనసులో మాట**



కూటమి గవర్నమెంట్ మెగా డీఎస్సీపై జరిగిన అవకతవకలు పై మాజీ సీఎం జగన్ ఆదేశాలు మేరకు నియోజకవర్గం ఇంచార్జి ధర్మ శ్రీ మరియు జిల్లా అధ్యక్షులు బొడ్డెడ ప్రసాద్ జిల్లా యూత్ అధ్యక్షులు పుల్లేటి వెంకటేష్ ఆధ్వర్యంలో 01/06/2026నసోమవారం ఉదయం 9:00 గంటలకు అనకాపల్లి జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద యువజన విభాగం ఆధ్వర్యంలో భారీ ధర్నా కార్యక్రమం వుంది కాబట్టి యువకులు నిరుద్యోగ యువత స్టూడెంట్స్ అందరు ఈ యొక్క ధర్నా కార్యక్రమం లో పాల్గొనీ ఈ యొక్క ధర్నా కార్యక్రమం ను విజయవంతం చేస్తారు అని కోరుకుంటున్నాను. ఈ యొక్క కార్యక్రమం లో జిల్లా సెక్రటరీ కాండ్రేగుల జగన్ అచ్చుతా పురం యూత్ అధ్యక్షులు కారుకుండి గంగూలీ శ్రీను రాంబిల్లి యూత్ అధ్యక్షులు ధూళి వెంకీ, శీయాద్రి నాగ నూకరాజు (బుజ్జి ) యూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

# విశాఖ నగరాభివృద్ధికి రూ.1,500 కోట్ల ప్రాజెక్టులు

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రాజెక్టులు నగర భవిష్యత్ అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తాయని పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (DISHA) సమావేశం అనంతరం ఆయన పోర్టుకో వద్ద మీడియాతో మాట్లాడారు.

దేశవ్యాప్తంగా పెరుగుతున్న పట్టణీకరణ, గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాలకు పెరుగుతున్న వలసలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నగరాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ వినూత్న పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం కింద విశాఖపట్నంలోని మధురవాడ జోన్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, 24 గంటల తాగునీటి సరఫరా, నగరవ్యాప్తంగా బల్క్, సెమీ బల్క్ వాటర్ సప్లై వ్యవస్థల అభివృద్ధికి రూ.1,500 కోట్ల ప్రాజెక్టులు మంజూరయ్యాయని వెల్లడించారు. ప్రాజెక్టులు మంజూరైన తర్వాత వాటి అమలు వేగవంతం చేయడంపై దిశా సమావేశంలో ప్రత్యేకంగా చర్చించినట్లు తెలిపారు. నిధుల సమీకరణతో పాటు పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడంపైనే ప్రధాన దృష్టి పెట్టామని పేర్కొన్నారు. గతంలో నిలిచిపోయిన పలు తాగునీటి, మౌలిక వసతుల ప్రాజెక్టులను తిరిగి పునరుద్ధరించి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి మార్గదర్శకత్వంలో నిలిచిపోయిన పథకాలకు కొత్త రూపకల్పనతో నిధులు సమీకరించి ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు.ఇదే తరహాలో నగరవ్యాప్తంగా సమగ్ర మురుగు నీటి నిర్వహణ, నీటి శుద్ధీకరణ, శుద్ధి చేసిన నీటిని పారిశ్రామిక, ఇతర అవసరాలకు వినియోగించే లక్ష్యంతో మరో రూ.1,500 కోట్ల ప్రాజెక్టును అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద ప్రతిపాదించన్నట్లు ఎంపీ శ్రీభరత్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. నగరంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, తీరప్రాంత కాలుష్య నివారణ చర్యలు, అండర్‌గ్రౌండ్ విద్యుత్ వ్యవస్థ, తాగునీటి ప్రాజెక్టులు, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు పురోగతిపై దిశా సమావేశంలో సమగ్ర సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. విశాఖపట్నాన్ని ఆధునిక మౌలిక సదుపాయాలు, మెరుగైన తాగునీటి వ్యవస్థ, సమర్థవంతమైన మురుగునీటి నిర్వహణ, పర్యావరణ పరిరక్షణతో కూడిన ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

మనసులో మాట
KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

# స్వచ్ఛ ఆంధ్ర కోసం మంత్రి సంధ్యారాణి చీపురు పట్టారు





- **ఇంధన పొదుపుకు బైక్‌పై వచ్చి ఆదర్శంగా నిలిచిన మంత్రి గుమ్మడి**

**పార్వతీపురం (సాలూరు) మనసులో మాట జిల్లా ప్రతినిధి,మే 30:**

స్వచ్ఛమైన పరిసరాలు, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల భాగస్వామ్యంతోనే “స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర” సాధ్యమవుతుందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. సాలూరు పట్టణంలో శనివారం నిర్వహించిన “స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర” కార్యక్రమంలో పాల్గొన్న ఆమె స్వయంగా చీపురు పట్టి రోడ్లు, కాలువలను శుభ్రం చేసి ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. పరిశుభ్రత ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్న మంత్రి, చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లో మాత్రమే వేయాలని సూచించారు. పట్టణ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ, పారిశుధ్య నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని చెప్పారు. ఇంధన పొదుపుపై అవగాహన కల్పించేందుకు మంత్రి తన నివాసం నుంచి బైక్‌పై కార్యక్రమానికి చేరుకున్నారు. అధికారులు, పోలీసులు, సిబ్బంది కూడా బైక్‌లపై ప్రయాణించి ఇంధన సంరక్షణకు తమ మద్దతు తెలిపారు. అవసరం లేని కారు వినియోగాన్ని తగ్గించి ఇంధన పొదుపుకు అందరూ కృషి చేయాలని మంత్రి సూచించారు.

కార్యక్రమం అనంతరం మహిళలతో కలిసి టీ తాగుతూ ఆత్మీయంగా మాట్లాడిన మంత్రి వారి సమస్యలు తెలుసుకున్నారు. మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, మహిళల అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. పారిశుధ్య సిబ్బందితో కలిసి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి, వారి సేవలను ప్రత్యేకంగా అభినందించారు. పట్టణాలను పరిశుభ్రంగా ఉంచడంలో వారి పాత్ర ప్రశంసనీయమని పేర్కొన్నారు.

# గజరెడ్డిపాలెంను ‘దీవి’గా మార్చిన సోలార్ కంపెనీ

- **గ్రామస్థుల ఆందోళనలపై రంగంలోకి దిగిన వైఎస్ఆర్సిపి నేతలు**
- **ఎం ర్ ఓకు వినతి .. “ ఆర్అండ్ఆర్ లేకుంటే 14 డిమాండ్లు తీర్చాలి”**



**రాంబిల్లి మే 30 మనసులో మాట**

అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం గజరెడ్డిపాలెం గ్రామం ‘రెన్యూ సోలార్ కంపెనీ’ ఫెన్సింగ్ కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంపెనీ ఏర్పాటు చేసిన భారీ కంచెతో గ్రామం పూర్తిగా నిర్బంధంలోకి వెళ్లిపోయిందని, ప్రజలు రాకపోకలకు కూడా ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తున్నారు.

గ్రామానికి వెళ్లే రహదారులు మూసుకుపోవడం, స్మశాన వాటికకు దారి లేకపోవడం, దేవాలయాల భూములు ఆక్రమణకు గురవడం, సంప్రదాయ మత్స్యకార ఉపాధి దెబ్బతినడం వంటి సమస్యలతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. “అభివృద్ధి పేరుతో గ్రామాన్ని బలి తీసుకుంటున్నారా?” అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ఈ సమస్యలపై స్పందించిన వైఎస్ఆర్సిపి నాయకులు గురువారం రాంబిల్లి మండల తహశీల్దార్ (MRO) కార్యాలయాన్ని కలిసి వినతి పత్రం సమర్పించారు. భూసేకరణ, పునరావాస మరియు పునర్నిర్మాణ చట్టం-2013 ప్రకారం గజరెడ్డిపాలెం గ్రామ ప్రజలకు పూర్తి స్థాయి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేసి సురక్షిత ప్రాంతానికి తరలించాలని వారు డిమాండ్ చేశారు.

# రైతులకు సమాచారం లేకుండా రీ సర్వే పనులు

**గొలుగొండ, మే 30, ( మనసులో మాట):**

మండలంలో కొత్త మల్లంపేట రెవెన్యూ గ్రామంలో మే నెల 29 నుంచి రీసర్వే కార్యక్రమం ప్రారంభించారు. అయితే సర్వే చేస్తున్న నెంబర్లకు సంబంధించిన రైతులకు ఎటువంటి సమాచారం అందించకుండా అధికారులు సర్వే చేస్తున్నారని పలువురు రైతులు చెబుతున్నారు. కొత్త మల్లంపేట రెవెన్యూ కి చెందిన 1, 2 సర్వే నెంబర్లలో శుక్రవారం జరిగిన ఈ సర్వేకు ఆ సర్వే నెంబర్లు కలిగి ఉన్న రైతులకి ఏ విధమైన సమాచారం లేదని సాగు రైతులైన మరిసా దేవుడు దన్నిన శ్రీనివాసు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం రీసర్వే పనులకు రైతులు లేకుండా చేయకూడదని చెబుతున్నప్పటికీ అధికారులు ఏమి పట్టనట్లుగా వ్యవహరిస్తూ రీ సర్వే చేపట్టి రైతులని అయోమయానికి గురిచేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు రీసర్వే పనులు చేస్తున్నప్పుడు కచ్చితంగా సంబంధిత భూ యజమాని ఉండేటట్లుగా చూడాలని రైతుల కోరుతున్నారు.రైతులకు రీ సర్వే సమాచారం అందించి సంబధిత రైతుల సమక్షంలో రీ సర్వే చేపడితే ఏ విధయిన సమస్యలు ఉత్పన్నం కావని రైతులు పేర్కొన్నారు.గతంలో కూడా రీ సర్వే సమయంలో రైతులు లేకుండా వారి భూములకు రీ సర్వే చేయడం వల్ల చాలా సమస్యలు వచ్చాయని వాటిని పరిష్కరించుకోవడం కోసం ఇప్పటికీ రైతులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారని గుర్తుచేశారు.కావున రీ సర్వే సమయంలో ఆ రోజు సర్వే చేపట్టే భూములకు చెందిన రైతులను పిలిచి వారి సమక్షంలో నే సర్వే చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

# యలమంచిలి 16వ వార్డులో ‘ఆపరేషన్ క్లీన్ స్వీప్’



**యలమంచిలి మే 30 ( మనసులో మాట)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన “ఆపరేషన్ క్లీన్ స్వీప్ - ఒక రాష్ట్రం, ఒక పరిశుభ్రత లక్ష్యం” కార్యక్రమంలో భాగంగా యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు ఫైర్ ఆఫీస్ కాలనీలో శనివారం ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు.

ఆంధ్రప్రదేశ్‌లోని 123 పట్టణ స్థానిక సంస్థలు (యు ఎల్ బి ఎస్)లో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా శుభ్రమైన రోడ్లు, శుభ్రమైన డ్రెయిన్లు, పరిశుభ్రమైన పరిసరాల ఏర్పాటే ప్రధాన లక్ష్యంగా అధికారులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కాలనీలోని రోడ్లు, కాలువలు, ఖాళీ ప్రదేశాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు.

ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అధికారులు, ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ లక్ష్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ప్రభుత్వం చేపడుతున్న పరిశుభ్రత కార్యక్రమాలకు సహకరించాలని పిలుపునిచ్చారు.

# మలేరియా నియంత్రణలో ముందడుగు.. లఘునాటికతో ప్రజలకు అవగాహన

- **ప్రజారోగ్యం మెరుగుకు సమష్టి కార్యాచరణతో వినూత్న కార్యక్రమాలు.**

**కురుపాం, మే 30 :**

ప్రజారోగ్యమే ధ్యేయంగా సమష్టి కార్యాచరణతో వినూత్న కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతుందనీ, మలేరియా నియంత్రణకై మరింత శ్రద్ధ వహిస్తూ చర్యలు చేపడుతున్నామని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కర రావు పేర్కొన్నారు. మర్రిగూడ గ్రామాన్ని సందర్శించి,. అక్కడ నిర్వహించిన మా ఊరికి మలేరియా వచ్చింది, లార్వా వేట, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాల్లో పాల్గొని పర్యవేక్షణ చేశారు. గ్రామంలో ప్రతి వీధిని, పరిసరాలను పరిశీలిస్తూ లార్వా ఉనికి గుర్తించిన ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్ వేయించారు.ఇంటి పరిసరాల్లో నిల్వ నీటిని పారబోయించారు. అక్కడ ప్రజలకు లార్వా ని చూపిస్తూ అవగాహన కల్పించారు.ఇళ్లను సందర్శించి దోమ తెరల వినియోగంపై పరిశీలించారు. వారితో మాట్లాడి ఆరోగ్య సమాచారం తెలుసుకున్నారు. గ్రామంలో ఐఆర్ఎస్ దోమల మందు స్ప్రేయింగ్ నిర్వహించిన తీరును తనిఖీ చేశారు. అనంతరం అక్కడ వైద్య శిబిరాన్ని తనిఖీ చేసి రక్త పరీక్షలు పరిశీలించారు. మందులు, ఓఆర్ఎస్ లభ్యత తనిఖీ చేశారు. వేసవి ఉష్ణగ్రతల కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. బాలల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.

నాటు వైద్యానికో నమస్కారం: శాస్త్రీయ ఆధారాలు లేని నాటు వైద్యాన్ని ఆశ్రయించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని డిఎంహెచ్ఓ సూచించారు. ఆరోగ్య కేంద్రాలు, గ్రామీణ స్థాయిలో వైద్య సిబ్బంది ప్రజలకు వైద్య సేవలు అందించడంలో అలసత్వం వహిస్తే తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం నాటువైద్యంపై ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రదర్శించిన లఘునాటిక విశేషంగా ఆకట్టుకుంది. ప్రజల్లో అవగాహనకు మరింతగా దోహద పడుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్.సి.డి అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు, డిఎంఓ డి. సూర్యనారాయణ, ప్రోగ్రాం అధికారి డా కె. సూర్య కౌశిక్, ఎం.పి.డి.ఓ ఎస్. రమేష్ , వైద్యాధికారి డా ఎన్. యామిని, డిప్యూటీ ఎం.పి.డి.ఓ రాధా కృష్ణ, సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్. రమణ, పంచాయతీ సెక్రటరీ పి. సంజీతు, ఆరోగ్య పర్యవేక్షకులు పి.నవో నమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# చెరువుల పరిరక్షణ పారిశుధ్యానికే ప్రథమ ప్రాధాన్యం



- జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి

**పార్వతీపురం మనసులో మాట జిల్లా ప్రతినిధి , మే 30:**

జిల్లాలోని చెరువుల పరిరక్షణ, మురుగునీటి కాలువల ఆధునీకరణ మరియు ప్రజా ఆరోగ్య రక్షణే ధ్యేయంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తోందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక శివాలయం చెరువు వద్ద ముమ్మరంగా సాగుతున్న 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' పనులను, నూతనంగా అందుబాటులోకి వచ్చిన వాకింగ్ ట్రాక్‌ను శనివారం నాడు పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి గారు మున్సిపల్ అధికారులతో మాట్లాడి పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ పరిధిలోని జనావాసాలు, చెరువుల పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండాలి. 'ఆపరేషన్ క్లీన్ స్వీప్'లో భాగంగా శివాలయం చెరువు పక్కనే ఉన్న డ్రైన్లు, స్టామ్ వాటర్ డ్రైన్లు (వరద నీటి కాలువలు) మరియు నాలాల్లో పూడికతీత పనులను ముమ్మరం చేయించాం. వర్షాకాలం రానున్న నేపథ్యంలో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా, మురుగునీరు సజావుగా సాగిపోయేలా ముందస్తు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.

జిల్లాలోని చెరువులు, కాలువలు, ఇతర జల వనరుల పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని కలెక్టర్ తెలిపారు. భూగర్భ జలాల మట్టాలు పడిపోకుండా వర్షపు నీటిని సక్రమంగా సంరక్షించుకోవాలని సూచించారు. చెరువుల ఆక్రమణలను నివారించడం, నీటి వనరుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడవచ్చన్నారు. ఈ పర్యటనలో మునిసిపల్ కమీషనర్ పావని, మెప్మా పి.డి నాగభూషణ రావు, శ్రీహరి,సభ్యులు, మున్సిపాలిటీ, సచివాలయ అధికారులు, సిబ్బంది, వార్డ్ ప్రజలు ఉన్నారు.

# మంచానికే పరిమితమైన పట్నాల శ్రీనుకు రూ.18.40 లక్షల ఆర్థిక సాయం



**మాకవరపాలెం, మే 30:(మనసులో మాట)**

మాకవరపాలెం మండలం రాచపల్లి గ్రామానికి చెందిన పట్నాల శ్రీను అనారోగ్యంతో మంచానికే పరిమితమవడంతో ఆయన కుటుంబానికి అండగా నిలిచేందుకు "సాయం 10 రూపాయలు" స్వచ్ఛంద సంస్థ సభ్యులు చేపట్టిన విరాళాల సేకరణ కార్యక్రమం విశేష ఫలితాన్ని ఇచ్చింది.

సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన విరాళాల సేకరణ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. దాతలు అందించిన విరాళాల ద్వారా మొత్తం రూ.18.40 లక్షలు సేకరించగా, ఆ మొత్తాన్ని శనివారం పట్నాల శ్రీను కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, దాతలు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. సమాజ సేవ పట్ల సంస్థ సభ్యులు చూపిన చొరవను పలువురు అభినందించారు.

# సువర్ణముఖి నీటి ప్రాజెక్టుకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే బేబీనాయన





- యూ. ఐ. డి. ఎఫ్. (అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ ఫండ్ ) నిధులు రూ123.9 కోట్లతో బొబ్బిలి పట్టణానికి త్రాగునీటి ప్రాజెక్టు.
- ఈ ప్రాజెక్ట్ కింద పట్టణ పరిధిలో 4 కొత్త రిజర్వాయర్లను నిర్మించి ఇంటింటికీ నీటి సరఫరా చేయనున్నారు.
- సువర్ణముఖి నది నుంచి సుమారు 16 కిలోమీటర్ల మేర పైపులైను నిర్మాణం.

**బొబ్బిలి, మే 30,(మనసులో మాట)**

బొబ్బిలి నియోజకవర్గంలో, బొబ్బిలి పట్టణ ప్రజల త్రాగునీటి సమస్యను శాసనసభ్యులు ఆర్.వీ.ఎస్.కె.కె.రంగారావు (బేబీ నాయన) ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి, యూ. ఐ. డి. ఎఫ్.(అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ ఫండ్) నిధులు 123.9 కోట్ల మంజూరు చేయించడం జరిగింది. శనివారం ఉదయం స్వామివారి వీధిలో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయం వెనుక రిజర్వాయర్ నిర్మాణానికి భూమిపూజ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేబీనాయన మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా బొబ్బిలి పట్టణ ప్రజల త్రాగునీటి కష్టాలు తీరనున్నట్లు తెలిపారు. 2019లో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు 90కోట్లతో మంజూరైన ఈ ప్రాజెక్టు, ఎన్నికల కోడ్ కారణంగా అమలు కాలేదు. వైసీపీ ప్రభుత్వం హయాములో ఎటువంటి పురోగతి నోచుకొని కారణంగా, బొబ్బిలి ప్రజల త్రాగునీటి కష్టాలకు నేటికీ పరిష్కారం లభించలేదన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఈ. ఈ. ఎస్.జ్యోతి , మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి , మాజీ చైర్మన్ రాంబర్కి శరత్ , వార్డు ప్రతినిధులు, టీడీపీ మరియు జనసేన నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాలువలో పూడిక తీసిన కలెక్టర్

**విజయనగరం (మనసులో మాట) జిల్లా ప్రతినిధి, మే 30 :**





పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యం ప్రజలందరి బాధ్యతని జిల్లా కలెక్టర్, కార్పొరేషన్ ప్రత్యేకాధికారి ఎస్.రాంసుందర్ రెడ్డి స్పష్టం చేశారు. పరిశుభ్రమైన నగరంగా విజయనగరాన్ని తీర్చిదిద్దడానికి ప్రతీఒక్కరూ ముందడుగు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో రెండో వారం కార్యక్రమాన్ని స్థానిక కణపాక వద్ద శనివారం జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. కాలువల్లో పూడిక తొలగించే ప్రక్రియను ఆయన స్వయంగా ప్రారంభించారు. అంతకు ముందు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములై, మన పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని కోరారు. నాలుగు వారాల ఈ కార్యక్రమంలో భాగంగా రెండో వారం కాలువలు, డ్రైన్లలో పూడిక తొలగించి శుభ్రపరచడం జరుగుతుందని చెప్పారు. చెత్తను కాలువల్లో వేయకూడదని, చెత్తబుట్టల్లో వేసి ఇంటింటికీ వచ్చే పారిశుధ్య పనివారికి అందజేయాలని కోరారు. వీలైనంత వరకు పాలిథిన్ ను, తడిచెత్తను వేరుచేయాలని, తడిచెత్త ను సేంద్రీయ ఎరువు తయారు చేయడానికి ఉపయోగించాలని సూచించారు.

# ప్రమాధాలు, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్ఐ పి మనోజ్ కుమార్

**బుచ్చియ్యపేట, మే 30 (మనసు లో మాట):**




ప్రమాధాలు, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పి మనోజ్ కుమార్ అన్నారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు, సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఎం. శ్రావణి, సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. కోటేశ్వరరావుల సూచనలతో మండలంలోని కందిపూడి గ్రామంలో శనివారం బుచ్చయ్యపేట పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ పి మనోజ్ కుమార్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, మహిళల భద్రత, రోడ్డు భద్రత, ఇటీవల పెరుగుతున్న సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత బ్యాంకు వివరాలు, ఓ టి పి లు ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని వివరించారు.

మనసులో మాట

# కాలువ నీరే దిక్కు.. రాళ్లబాటలోనే ప్రయాణం!





- పి.మాకవరం పంచాయితీలో తాగునీరు, రహదారి సమస్యలతో అల్లాడుతున్న గిరిజనులు
- సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్, ఐటీడీఏ పీఓలకు విజ్ఞప్తి

**కొయ్యూరు, మే 30 (మనసులో మాట):**

అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం పి. మాకవరం పంచాయితీ పరిధిలోని రామచంద్రాపురం, చిన్నయ్యకొండ గ్రామాల్లో తాగునీటి, రహదారి సమస్యలు తీవ్రరూపం దాల్చాయి. సంవత్సరాలు గడుస్తున్నా తమకు మౌలిక వసతులు కరువయ్యాయని, పాలకులు మారుతున్నా తమ బతుకులు మారడం లేదని రెండు గ్రామాల గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**బురద నీరే జీవనాధారం.. 'జల జీవన్' పడకేసింది!**

ఈ రెండు గ్రామాల్లోని ప్రజలు తాగేందుకు, వంట వండుకునేందుకు, చివరకు నిత్య అవసరాలకు కూడా స్థానిక కాలువ నీటిపైనే ఆధారపడుతున్నారు.ముఖ్యంగా వర్షాకాలంలో వర్షాలు పడినప్పుడు కాలువ నీరు పూర్తిగా బురదమయంగా మారుతుందని, వేరే ప్రత్యామ్నాయం లేకపోవడంతో అదే కలుషిత నీటిని తాగాల్సి వస్తోందని వారు ఆవేదన చెందుతున్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'జల జీవన్ మిషన్' పథకం ఇక్కడ పూర్తిగా అటకెక్కింది. ఐదు నెలల క్రితం ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తామని చెప్పి, చిన్నయ్యకొండ గ్రామంలో వాటర్ పైపులు తెచ్చి పడేశారని గ్రామస్తులు తెలిపారు. పైపులు తెచ్చి పడేసి ఐదు నెలలు గడుస్తున్నా, నేటికీ పనులు ప్రారంభించడానికి ఏ ఒక్క అధికారి కూడా ఇటువైపు కన్నెత్తి చూడలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నరకప్రాయంగా రహదారి ప్రయాణం**

ఇక రహదారి విషయానికొస్తే.. గానుగుల గ్రామం నుండి రామచంద్రాపురం వరకు సుమారు మూడు నుండి నాలుగు కిలో మీటర్ల మేర ఉన్న రహదారి పూర్తిగా ధ్వంసమైంది.

# పల్లెపండగ బిల్లుల బకాయిలు త్వరగా చెల్లించాలి

## : భీశెట్టి బాబ్జి



**విజయనగరం, మే 30 (మనసులో మాట) :**

ఉపాధిహామీ పథకంలో భాగంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు పల్లె పండగ 2.0 పనులు చేసిన గ్రామీణ యువతకు నేటికీ కొంతమందికి ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో చాలా మంది ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి ఆందోళన వ్యక్తం చేశారు. డ్వామా పీడీ ఎస్. శారద దేవి దృష్టికి ఈ విషయాన్ని తీసుకువచ్చారు. శనివారం పీడీకి వినతిపత్రం అందచేశారు. అనంతరం భీశెట్టి విలేకరులతో మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెప్పిన మాటను నమ్మి ప్రతీ వారం బిల్లుల్లు పడతాయనే ఆశతో కాంట్రాక్టర్లు ఎదురు చూస్తున్నారని తెలిపారు. సకాలంలో బిల్లులు అందకపోవడంతో ఉత్సాహంగా పనిచేసినవారు, అప్పుల పాలయిపోయారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందని తెలిపారు. విజయనగరం జిల్లాలో వేజ్ కాంపొనెంట్ 75 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్ 100 కోట్లు పెండింగ్ లో ఉన్నాయని, చేబదులు తెచ్చి రోడ్లు, డ్రైనేజి లు పూర్తి చేసిన వారి పరిస్థితి గందరగోళం గా ఉందని చెప్పారు.

# ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలి

## : ప్రకృతి వ్యవసాయం డిపిఎం విజయ్ కుమార్




**గంట్యాడ, మే 30 (మనసులో మాట):**

ప్రకృతి వ్యవసాయం వలన బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని, అందువల్ల రైతులు ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని, శనివారం గంట్యాడ మండలం బోనంగి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ జీవి విజయ్ కుమార్ సూచించారు. బోనంగి గ్రామము లో క్షేత్రస్థాయి పర్యటన లో భాగంగా రైతుల కు ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యతను, ఉపయోగాలను తెలియజేశారు. పిఎండిఎస్ వలన నేలలో సూక్ష్మ జీవుల వృద్ధి చెందుతాయని, మొక్కలకు కావలసిన పోషకాలను బయట నుంచి ఇవ్వాల్సిన అవసరం లేకుండా నేరుగా సూక్ష్మజీవులే పంటకు కావలసిన పోషకాలు అందిస్తాయని ఆయన చెప్పారు. రైతులు ముందుగానే మేల్కొని పీఎండిఎస్ ద్వారా ఆదాయాన్నిసాధించాలనిసూచించారు.కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.

# ఖరీఫ్‌కు సన్నద్ధం.. రైతులకు భారీ ఎత్తున రాయితీ విత్తనాలు



- వ్యవసాయ పరికరాల పంపిణీ
- మంత్రి గుమ్మడి సంధ్యారాణి

**పార్వతీపురం మనసులో మాట జిల్లా ప్రతినిధి , మే 30 :**

ఖరీఫ్2026 సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు, పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు, వ్యవసాయ పరికరాలు సకాలంలో అందించి సాగుకు పూర్తి సహకారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని గిరిజన సంక్షేమ, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. రైతుల ఉత్పాదకత పెంపు, ప్రకృతి వ్యవసాయ ప్రోత్సాహం, గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ఖరీఫ్2026 విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రివర్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్2026కు అవసరమైన 22,348 క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఇందులో జనరల్ రాయితీ కింద 13,465 క్వింటాళ్లు, 90 శాతం రాయితీపై 8,883 క్వింటాళ్ల విత్తనాలను రైతులకు అందించనున్నట్లు చెప్పారు. అలాగే పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను జనరల్, ఎస్సీ రైతులకు 50 శాతం రాయితీతో, ఎస్టీ రైతులకు 90 శాతం రాయితీతో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. జీలుగ, కట్టె జనుము, పిల్లి పెసర విత్తనాలను పెద్ద ఎత్తున సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ ద్వారా 202324 సంవత్సరానికి సంబంధించిన SCA to TSS పథకం కింద 802 టార్పాలిన్లు, 14 ఆయిల్ ఇంజన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

# కాలువల సిల్టు తొలగింపు పనులు పరిశీలించిన కమిషనర్ రామలక్ష్మి

**బొబ్బిలి, మే 30,(మనసులో మాట)**

రానున్న వర్షాకాలం దృష్ట్యా ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణ పరిధిలో గల శ్వేతా చలపతి స్కూలు రోడ్డు, చాకలి వీధి, సున్నపు వీధి మరియు దిబ్బ వీధి ఏరియాలలో జరుగుతున్న మేజర్ డ్రైన్, స్టార్మ్ వాటర్ డ్రైన్ లలో అవసరమైన చోట జెసిబి మరియు పారిశుద్ధ్య కార్మికుల చేత సిల్టు తొలగించుటను పరిశీలించిన మునిసిపల్ కమిషనర్ రామలక్ష్మి. పట్టణ పరిధిలో గల ప్రతి ఒక్క కాలువలలో పూర్తిస్థాయిలో సిల్టు తొలగించి నీరు పారే విధంగా చేయాలని శానిటరీ ఇన్స్పెక్టర్ వారికి తగు సూచనలు జారీ చేశారు.




KANCHARLA మనసులో మాట నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

## జూన్ నెలాఖరుకు 8వేల పనులు పూర్తి కావాలి :కలెక్టర్



**విజయనగరం, (మనసులో మాట) జిల్లా ప్రతినిధి, మే 30 :**

జలధార - జల హారతి క్రింద చేపడుతున్న పనులు వేగంగా పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారు. జూన్ నెలాఖరు నాటికి కనీసం 8 వేల పనులు పూర్తి కావాలన్నారు. శనివారం కలెక్టర్ జలధార పనుల పై మండల వారీగా సమీక్షించారు. జిల్లాలో జలధార క్రింద 12,305 పనులు మంజూరు కాగా 5 వేల పనులు ఇంతవరకూ ప్రారంభం అయినాయని, 1303 పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా మండల వారీగా ఎన్ని పనులు మంజూరైనాయి, ఎన్ని ప్రారంభం చేసారు, ఎన్ని పనులు పూర్తయినాయని ఆరా తీసారు. మంజురైనవన్నీ వెంటనే ప్రారంభం కావాలని, ప్రారంభించిన పనులు వేగంగా పూర్తి అయ్యేలా చూడాలని తెలిపారు. పనుల డైలీ రిపోర్ట్ పంపాలని డ్వామా పి.డి. కి సూచించారు. అలాగే నీటి పరిరక్షణ నిర్మాణాలను తనిఖీ చేయాలనీ, నీటి నిల్వల స్థితిని పరిశీలించాలని అన్నారు. ఉపాధి వేతన దారుల వేతనం పెరగాలని , ఉపాధి పనుల్లో వేగం పెరగాలని తెలిపారు. తాగు నీటి సరఫరా పై ఎక్కువ ఫిర్యాదులు అందుతున్నాయని, ఆర్.డబ్ల్యు.ఎస్ మండల స్థాయి అధికారులు నీటి సరఫరా పై దృష్టి పెట్టాలని, తాగు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. పరిశుభ్రమైన తాగు నీరు అందకపోతే ఏదో ఒక నీరు తీసుకోవడం జరుగుతుందని, అలాంటప్పుడే వ్యాధులు ప్రబలె అవకాశం ఉంటుందని, దీని పై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ టి సి లో ఆర్.డబ్ల్యు.ఎస్. ఎస్.ఈ కవిత, దవమ పి.డి. శారద దేవి, ఇరిగేషన్ ఈ ఈ రమణ, డి.డి.ఓ లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి



**పార్వతీపురం మనసులో మాట జిల్లా ప్రతినిధి , మే 30:**

జిల్లాలో చేపట్టిన వివిధ ప్రభుత్వ సివిల్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన సంబంధిత శాఖల అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి, ప్రగతిలో ఉన్న పలు అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పనుల నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా వేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమీక్షలో భాగంగా అధికారులకు క్రింది కీలక ఆదేశాలను జారీ చేశారు.

జిల్లాలో నిర్మాణ పనులు పూర్తయిన భవనాలను జూన్ 12వ తేదీ నాటికి ప్రారంభోత్సవానికి పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలు ఆయా భవనాల నిర్మాణాలను పూర్తి చేసి, జూన్ 10వ తేదీ లోగా సంబంధిత శాఖలకు హ్యాండోవర్ చేయవలసి ఉంటుంది. నిర్మాణంలో ఉన్న భవనాలలో మరుగుదొడ్లు మరియు తాగునీటి వసతి పనులను జూన్ 10, 2026 నాటికి ఖచ్చితంగా పూర్తి చేయాలి. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనుల పురోగతిపై ప్రతి వారం స్టేటస్ రిపోర్ట్ తప్పనిసరిగా సమర్పించాలి.

జిల్లాలో ఏర్పాటు అవుతున్న వన్ స్టాప్ సెంటర్ భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి, జూన్ 30వ తేదీ లోగా హ్యాండోవర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడానికి సీడీపీఓలు, సూపర్‌వైజర్లు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

## ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి





- ఐఒబి సీనియర్ రీజనల్ మేనేజర్ రవికుమార్ గుప్తా
- నర్సీపట్నంలో ఐఒబి శాఖ ప్రారంభం

**నర్సీపట్నం రూరల్, మే 30, ( మనసులో మాట) :**

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐఒబి సీనియర్ రీజనల్ మేనేజర్ రవికుమార్ గుప్తా పిలుపునిచ్చారు. శనివారం నర్సీపట్నంలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) నూతన శాఖను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ గుప్తా మాట్లాడుతూ, నర్సీపట్నం మరియు పరిసర ప్రాంతాల ప్రజలకు ఆధునిక బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేయడమే ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ లక్ష్యమని తెలిపారు. గృహ రుణాలు, వాహన రుణాలు, వ్యవసాయ రుణాలు, వ్యాపార రుణాలు, డిజిటల్ బ్యాంకింగ్ సేవలు, ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాలు వంటి అనేక సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గౌరవ అతిథిగా విచ్చేసిన ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ఎస్.వి.ఎస్. నాయుడు మాట్లాడుతూ, నర్సీపట్నం అభివృద్ధి చెందుతున్న వాణిజ్య కేంద్రంగా ఎదుగుతోందని, ఈ ప్రాంత ప్రజలకు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ శాఖ ప్రారంభం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిన నర్సీపట్నం ఆర్డీవో వి.వి. రమణ ఇతర అధికారిక కార్యక్రమాల కారణంగా హాజరు కాలేకపోయినప్పటికీ, నూతన శాఖ ప్రారంభం సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

## ఎల్ఐసిలో జమున రాణి సేవలు చిరస్మరణీయం

- వీడ్కోలు సభలో వక్తలు ప్రశంసలు



**గరివిడి, మే 30 (మనసులో మాట):**

భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ)లో సుదీర్ఘకాలం పాటు విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ పొందిన గరివిడి బ్రాంచ్‌కు చెందిన హెచ్‌జీఏ (హయ్యర్ గ్రేడ్ అసిస్టెంట్) శ్రీమతి బాసూరి జమునరాణిని ఎల్ఐసీ ఉద్యోగులు, అభివృద్ధి అధికారులు, ఏజెంట్లు ఘనంగా సన్మానించి ఆమె సేవలను కొనియాడారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ, జమునరాణి తన ఉద్యోగ జీవితమంతా క్రమశిక్షణ, అంకితభావం, నిజాయితీతో కూడిన సేవలు అందించారని కొనియాడారు. సహోద్యోగులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ, సంస్థ అభివృద్ధికి తనవంతు కృషి చేశారని పేర్కొన్నారు. ఆమె సేవలు ఎల్ఐసీ కుటుంబంలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయని అన్నారు.

కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ బోనీ వెంకట కుమార్ మాట్లాడుతూ, జమునరాణి సంస్థ పట్ల చూపిన నిబద్ధత, బాధ్యతాయుతమైన పనితీరు ప్రతి ఉద్యోగికి ఆదర్శమని అన్నారు. ఈ సందర్భంగా జమునరాణికి శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు.

అనంతరం జమునరాణి మాట్లాడుతూ, తన ఉద్యోగ జీవితంలో సహకరించిన సహోద్యోగులు, అధికారులు, ఏజెంట్లకు కృతజ్ఞతలు తెలిపారు.

## రాయితీపై రైతులుకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణి

**ఎస్. రాయవరం, మే 30,(మనసులో మాట):**



మండలకేంద్రమైన ఎస్. రాయవరంలోని వ్యవసాయాధికారి కార్యాలయంవద్ద వ్యవసాయ శాఖ అధ్వర్యంలో రైతులుకు రాయితీపై పచ్చిరొట్ట ఎరువు విత్తనాలును పంపిణీచేసారు. ఖరీఫ్ సీజన్ లో దమ్ము లోఎరువుగా వినియోగించేందుకుగాను య్జు జీలుగా, పిల్లిపెసర, జనుమువిత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఎఓ సౌజన్య తెలిపారు. 120 క్వింటాళ్ల జీలుగ, 15 క్వింటాళ్ల పిల్లి పెసర, 30 క్వింటాళ్ల జనుము విత్తనాలు 50శాతం రాయితీపై రైతులుకుఅందచేస్తున్నట్లు ఆమెతెలిపారు. శనివారం ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమం లో ఎంపిపి. కె. వెంకటలక్ష్మి, జెడ్పీటిసి కె. దేవి, వైస్ ఎంపిపి బోలిశెట్టిగోవిందరావు, టిడిపి మండల అధ్యక్షుడు అమలకంటిఅబ్బద్దం రైతులుకువిత్తనాలూ అందచేసారు. ఈకార్యక్రమంలో ఎస్. రాయవరం, కోరుప్రోలు పిఏసి ఎస్ అధ్యక్షులు తుంపాల నాగేశ్వరావు, గుర్రంరామకృష్ణ తోపాటు రైతుసేవాకేంద్రం సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# లక్ష్మీదేవిపేట రోడ్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి రైల్వే నుంచి సానుకూల స్పందన




- **దశాబ్దానికి పైగా ఉన్న సమస్య పరిష్కారానికి అనకాపల్లి ఎంపి డాక్టర్**
- **సిఎం రమేష్ ప్రత్యేక చొరవ**
- **దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ తో రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, అనకాపల్లి ఎంపీ డాక్టర్ సీఎం రమేష్ కీలక భేటీ**

**అనకాపల్లి ప్రతినిధి, మే 30 (మనసు లో మాట ):**

అనకాపల్లి పట్టణంలో దశాబ్దానికి పైగా పెండింగ్‌లో ఉన్న లక్ష్మీదేవిపేట రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం. రమేష్ ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఈ మేరకు సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం కార్యాలయంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ తో సమావేశమై పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా లక్ష్మీదేవిపేట లోని లెవెల్ క్రాసింగ్ నెం.485 స్థానంలో రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని అత్యవసరంగా చేపట్టాల్సిన అవసరాన్ని ఎంపీ సీఎం రమేష్ జీఎం దృష్టికి తీసుకెళ్లారు.ఈ ప్రాంతంలో రోజువారీగా వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుండగా, రైల్వే గేటు మూసివేతల కారణంగా తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులు పలుమార్లు ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపిన విషయాన్ని గుర్తు చేస్తూ, ప్రజల భద్రతతో పాటు ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం లక్ష్మీదేవిపేట ఆర్వోబి నిర్మాణాన్ని అత్యధిక ప్రాధాన్యతా ప్రాతిపదికన చేపట్టాలని కోరారు.

# ప్రభుత్వంపై దుష్ప్రచారం సరికాదు :ఎంపీ కలిశెట్టి



**విజయనగరం, (మనసులో మాట) జిల్లా ప్రతినిధి, మే 30 :**

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థుల ఫలితాల మెరుగుదలే లక్ష్యంగా, ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతూ, రాష్ట్ర విద్యా రంగానికి బంగారు భవిష్యత్తును అందిస్తుంటే ఓర్వలేని కొంతమంది వ్యక్తులు దుష్ప్రచారం చేస్తున్నారని, ఇది సరికాదని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. శనివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపీ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, ఆధునిక విద్యా విధానాలు అమలు, ఉపాధ్యాయుల నియామకాలు, ఖాళీల భర్తీ వంటి కీలక చర్యలతో విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ ఉంటే, భారతదేశం అంతటా మన రాష్ట్ర విద్య విధానాన్ని మెచ్చుకుంటోందని తెలిపారు. ఈ నేపథ్యంలో జగన్మోహన్ రెడ్డి, ఆయన సమూహం అక్కసుతో ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. మంత్రి లోకేష్ కు వస్తున్న పేరు ప్రతిష్ఠలను ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని, ఇటువంటి దుష్ప్రచారన్ని ఖండిస్తున్నామని తెలిపారు. దేశంలో మొదటిసారిగా డిజిటల్ వేదికగా తెలుగుదేశం పార్టీ మహానాడు 2026 కార్యక్రమాన్ని పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు వర్చువల్ గా జరిపించడం, రికార్డు స్థాయిలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయటం పట్ల అందరికీ ధన్యవాదములు తెలిపారు.

# కార్మిక హక్కులను హరిస్తున్న ప్రభుత్వాలను అరికడదాం

- **సిఐటియు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు**
- **పార్వతీపురం మున్సిపల్ కార్మికులు జండా ఆవిష్కరణ**



**పార్వతీపురం మనసులో మాట జిల్లా ప్రతినిధి, మే 30:**

దేశ కార్మిక వర్గ హక్కుల సాధన కోసం, శ్రమజీవుల సంక్షేమం కోసం, కార్మికుల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం నిరంతరం సిఐటియు పోరాడుతుందని సిఐటియు నాయకులు అన్నారు. శనివారం సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) 56 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సమస్త కార్మికులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా పార్వతీపురం పట్టణంలో మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు, కళాసీ, ఆటో స్టాండ్ వద్ద సిఐటియు జెండాలు ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు మాట్లాడుతూ 1970 మే 30న స్థాపించబడిన సిఐటియు, దేశంలోని కార్మిక వర్గానికి అండగా నిలుస్తూ వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం అనేక ఉద్యమాలను విజయవంతంగా నడిపిందనీ అన్నారు. అసంఘటిత రంగ కార్మికులు, నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కార్మికులు, మహిళా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సిఐటియు నిరంతరం కృషి చేస్తోందనీ తెలిపారు

# శాప్ స్పోర్ట్స్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం




- **ముఖ్యఅతిథిగా టీడీపీ నేత రామ్ మల్లిక్ నాయుడు**
- **విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి**

**చీపురుపల్లి మనసులో మాట మే 30:**

చీపురుపల్లిలో ఉత్సాహంగా ప్రారంభమైన 'సాప్' (శాప్) సమ్మర్ కోచింగ్ క్యాంప్ - ముఖ్య అతిథిగా యువనేత కిమిడి రామ మల్లిక్ నాయుడు పాల్గొన్నారు. చీపురుపల్లి పట్టణంలోని జెడ్పీ బాయ్స్ హై స్కూల్ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, యువనేత కిమిడి రామ మల్లిక్ నాయుడు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కిమిడి రామ మల్లిక్ నాయుడు మాట్లాడుతూ..

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని పిలుపునిచ్చారు.గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అద్భుతమైన క్రీడా ప్రతిభను వెలికితీసేందుకే ఇటువంటి శిక్షణ శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వ్యాయామ ఉపాధ్యాయులు, శిక్షకులు, విద్యార్థులు మరియు క్రీడా అభిమానులు పాల్గొన్నారు.

# పొగాకు వినియోగం వల్ల అనర్థాలు తప్పవు

## : పీహెచ్సీ వైద్యాధికారిణి డాక్టర్ హేమలత

**గంట్యాడ, మే 30 ( మనసులో మాట):**

పొగాకు వినియోగం వల్ల ఎన్నో అనర్థాలు ఎదురవుతాయని, శనివారం గంట్యాడలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ హేమలత అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని గంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ హేమలత ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి పలు నినాదాలు చేసుకుంటూ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ హేమలత మాట్లాడుతూ, పొగాకు వినియోగం వల్ల ఎదురయ్యే అనర్థాలు గురించి వివరించారు. పొగాకును ఏ రూపంలో కూడా తీసుకోవద్దని సూచించారు. ఇంకా పలు విషయాలపై ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



KANCHARLA మనసులో మాట నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

# రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించాలి

## :రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**గంట్యాడ, మే 30( మనసులో మాట):**

ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చే రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించాలని, శనివారం గంట్యాడ మండలం పెద్దమజ్జి పాలెం లో రాష్ట్ర సూక్ష్మ మధ్య చిన్న తరహా పరిశ్రమలు, సెర్ప్ ఎన్నారై సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. గంట్యాడ మండలంలోని పెద్దమజ్జిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి భవన పరిసరాలు, ఆపరేషన్ థియేటర్, మందులగది, ఔట్ పేషెంట్ల విభాగం తదితర గదులను ఆయన పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన అన్ని వివరాలను ఆన్లైన్లో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోజువారి రోగుల సంఖ్య, ఆసుపత్రిలో మందుల లభ్యత, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు తదితర విషయాలపై వైద్యాధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ పల్లవి, డాక్టర్ సతీష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణకు సిద్ధమైన యంత్రాంగం కలెక్టర్



**పార్వతీపురం మనసులో మాట , మే 30 :**

జిల్లాలో జూన్ 15 నుంచి ప్రారంభం కానున్న ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమైంది. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించనున్న బి ఎల్ ఓ లకు అవసరమైన ప్రత్యేక కిట్లను జిల్లా కలెక్టర్ శనివారం తన ఛాంబర్లో పంపిణీ చేశారు.

జూన్ 15 నుంచి జూలై 14 వరకు నిర్వహించనున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా బి ఎల్ ఓ లు సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు ఈ కిట్లను సిద్ధం చేశారు. ప్రతి కిట్లో స్టేషనరీ సామగ్రితో పాటు గొడుగు, వాటర్ బాటిల్ తదితర అవసరమైన వస్తువులను ఒక బ్యాగ్లో ఉంచి అందజేశారు.

జిల్లాలోని 1,032 మంది బి ఎల్ ఓ లకు ఈ కిట్లను వెంటనే పంపిణీ చేయాలని జిల్లా రెవెన్యూ అధికారికి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

# ఉపాధి శ్రామికులకు పనుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలి

- సీపీఎం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్



**నెల్లిమర్ల, మే 30 (మనసులో మాట)**

నెల్లిమర్ల మండలంలో నిర్వహిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల వద్ద కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఎం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓ రామారావుని కలిసి, ఉపాధి కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించారు.

ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ, మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను తాను క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు వెల్లడించారు. ఎండలు తీవ్రంగా ఉన్నప్పటికీ పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలైన తాగునీరు, నీడ కోసం టెంట్లు, ప్రథమ చికిత్స (ఫస్ట్ ఎయిడ్) కిట్లు వంటివి అందుబాటులో లేవని ఆవేదన వ్యక్తం చేశారు.

**రూ. 600 కూలి ఇవ్వాలి..**

ఉపాధి కూలీలకు వస్తున్న వేతనాలు అత్యల్పంగా ఉన్నాయని రామారావు పేర్కొన్నారు. వారం రోజుల పాటు కష్టపడి పనిచేసినా కేవలం రూ. 400 మాత్రమే వేతనం వచ్చిందని కొందరు వేతనదారులు తన వద్ద ఆవేదన వ్యక్తం చేశారని ఆయన తెలిపారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా ఉపాధి కార్మికులకు రోజుకు రూ. 600 కూలి గిట్టుబాటు అయ్యేలా పనులు కల్పించాలని, అలాగే పని ప్రదేశంలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు. సీపీఎం నాయకుని డిమాండ్లపై ఏపీఓ రామారావు స్పందిస్తూ.. పనిప్రదేశాల్లో నిబంధనల ప్రకారం సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు.

# మెరైన్ ఫిష్ సీడ్ లాంచింగ్ కార్యక్రమం లో పాల్గొన్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

**ఎచ్చెర్ల మే 30, (మనసులో మాట):**




శ్రీకాకుళం జిల్లా, ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం మండలం జీరుపాలెం సముద్ర తీరంలో ఈరోజు జిల్లా మత్స్య శాఖ వారి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా "మెరైన్ ఫిష్ సీడ్ లాంచింగ్" (సముద్రపు చేప పిల్లల విడుదల) కార్యక్రమం శాసనసభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు చేతుల మీదుగా నిర్వహించారు.

సముద్ర ఆధారిత చేపల పెంపకంలో (మెర్కుల్చర్), సముద్రపు చేపల విత్తనోత్పత్తి మరియు పెంపకం కార్యక్రమాలు కేంద్ర సముద్ర మత్స్య పరిశోధన సంస్థ (సీఎం ఎఫ్ ఆర్ ఐ) ద్వారా నిర్వహించడం జరుగుతున్న కార్యక్రమంలో మత్స్యకార కుటుంబాలను ఉద్దేశించి ఎమ్మెల్యే ఎన్ఈఆర్ మాట్లాడారు. వేట విరామ సమయంలో ప్రభుత్వం మత్స్యకారులకు ఆర్థిక సాయం అందించే కార్యక్రమాలు చేపట్టిందని ప్రధాని నరేంద్ర మోడీ , ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమం లో ఫిషరీస్ డిడి, ఇతర మత్స్య శాఖ అధికారులు, మత్స్యకార నాయకులు దుమ్ము అశోక్ చీకటి శ్రీరాములు, అల్లుపల్లి రాంబాబు సూరాడ రాముడు, వారధి ఎర్రయ్య, అమర లక్ష్మణరావు, కొమర లక్ష్మణ్, రాజశేఖర్,ఆది మరియు మండల నాయకులు లంక శ్యామల రావు,పిసిని జగన్నాథం నాయుడు, సుంకర ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# 'పెద్ది' ప్రమోషనల్ మెగా టూర్ – మాస్ జాతర

**విజయనగరం, మే 30 (మనసులో మాట) :**



పెద్ది ప్రమోషనల్ మెగా టూర్ కార్ మాస్ జాతర వన్ సి మీడియా, విజయనగరం జిల్లా మెగా ఫ్యామిలీ అభిమానుల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి కోవెల దగ్గరకు "పెద్ది కార్" ఆగమనం జరిగింది. పైడితల్లి అమ్మవారి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తీన్మార్, కాంగో డప్పులతో, టపాసులు కాల్చి భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. అమ్మవారి కోవెల నుండి ప్రారంభమైన ర్యాలీ గంటస్తంభం, వన్ టౌన్ పోలీస్ స్టేషన్, పెద్ద చెరువు (రామానాయుడు) రోడ్డు, మీదుగా ఎన్.సి.ఎస్. థియేటర్ వద్దకు చేరుకుంది. ఎన్.సి. ఎస్. థియేటర్ వద్ద పెద్ది మూవీ మెగా వేడుకల్లో భాగంగా కేక్ కటింగ్ చేసి, మెగా అభిమానులంతా స్వీట్స్ పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మెగా ఫ్యామిలీ అభిమానులు, జనసేన శ్రేణులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

# సర్వ హక్కులు ఉన్నా గిరిజనులకు ఇల్లు నిర్మాణానికి హక్కు లేదా!

- 1/70 చట్టంని ఉల్లంఘించిన హుకుంపేట తాసిల్దార్ పై చర్యలు తీసుకోవాలి.
- తనకు న్యాయం చేయాలని ఆదివాసీ యువకుడు కంబ శ్రీను విజ్ఞప్తి



**హుకుంపేట మే 30 మనసులో మాట**

హుకుంపేట మండల కేంద్రానికి చెందిన ఆదివాసీ యువకుడు కంబ శ్రీను శనివారం విలేకరుల సమావేశంలో తన సమస్యను వివరించారు.

తాను ఆదివాసినని, నిరుద్యోగినని, స్వయం ఉపాధి కోసం హుకుంపేట అనాధా ఆశ్రమం ఎదురుగా జిరాక్స్, నెట్ సెంటర్ ఏర్పాటు చేసుకోవడానికి 2009లో అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ, సబ్ కలెక్టర్‌లకు దరఖాస్తు చేసుకున్నానని తెలిపారు. తన దరఖాస్తుపై స్పందించిన అధికారులు స్థానిక రెవెన్యూ అధికారులకు పంపించగా, వారు 2012లో సర్వే నంబర్ 75లో 3.5 సెంట్ల స్థలాన్ని కేటాయించి ఎల్‌పీసీ హక్కు పత్రం ఇచ్చారని చెప్పారు. ఆ స్థలంలో చెక్కలతో బడ్డీ నిర్మించుకొని జిరాక్స్, నెట్ సెంటర్ నిర్వహిస్తూ జీవనోపాధి సాగిస్తున్నానని తెలిపారు. 2012 నుంచి ఆ స్థలం తన స్వాధీనంలోనే ఉందని, 15 సంవత్సరాలుగా శిస్తు కూడా చెల్లిస్తున్నానని పేర్కొన్నారు.

హుద్‌హుద్ తుఫాన్ సమయంలో తన షాపుపై చెట్ల కొమ్మలు పడటంతో షాపు శిథిలావస్థకు చేరిందని, జిరాక్స్ మిషన్, కంప్యూటర్ కూడా దెబ్బతిన్నాయని తెలిపారు. దీంతో తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని, అనంతరం తన భార్య అనారోగ్యంతో మరణించడంతో మానసికంగా, ఆర్థికంగా పూర్తిగా కుదేలయ్యానని చెప్పారు. ఆ కారణంగా పక్కా షాపు నిర్మించుకోలేక పోయానన్నారు.

కొద్ది రోజుల క్రితం ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు చేసి నిర్మాణ పనులు ప్రారంభించగా, కాకినాడ విజయ మోదమాంబ అనే గిరిజనేతరురాలు తనపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిందని ఆరోపించారు. దాంతో తహసీల్దార్ తనపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని, అలాగే గిరిజనేతరాలు ఉసిగొలిపి నాపై దాడి కూడా చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు.

# ఎల్.కోట ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే లలితకుమారి



**శృంగవరపుకోట,ఎల్.కోట, మే 30 (మనుసులో మాట ):**

ప్రజా సమస్యల త్వరితగతిన పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎస్.కోట శాసనసభ్యురాలు శ్రీమతి కోళ్ల లలితకుమారి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 'ప్రజాదర్బార్' కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుండి తరలివచ్చిన ప్రజల నుండి ఆమె నేరుగా వినతులను, అర్జీలను స్వీకరించారు. ఈ ప్రజాదర్బార్‌లో పెన్షన్లకు సంబంధించి అత్యధికంగా 118 వినతులు రాగా, రెవెన్యూ శాఖకు సంబంధించి 3, అలాగే రీసర్వే, పోలీస్ శాఖ, ఈపీడీసీఎల్ (విద్యుత్) సమస్యలపై ఒక్కో వినతి చొప్పున మొత్తం 124 అర్జీలు ఎమ్మెల్యే దృష్టికి వచ్చాయి.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే లలితకుమారి గారు మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఆశతో క్యాంప్ కార్యాలయానికి వస్తున్నారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

# ధర్మవరం లో మంచి నీటి సమస్య పరిష్కారం కొరకు కదిలిన అధికార యంత్రాంగం

**ఎస్. రాయవరం, మే 30,(మనసులో-మాట):**

ఎస్.రాయవరం మండలం, ధర్మవరం అగ్రహారం గ్రామంలోని వివేకానంద కాలనీ, కొత్తూరు ధర్మవరం లో రక్షిత మంచినీరు కుళాయిలు అందక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న విషయంను అధికారులు దృష్టికి తీసుకునివెళ్ళాగా, దీని పై స్పందించిన గ్రామీణ త్రాగునీరు సరఫరా విభాగం జే ఈ శ్రీనివాస్,గ్రామ కార్యదర్శి రాజు, సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ నాగరాజు,ఆపరేటర్ ఈశ్వరరావు గ్రామంలో పర్యటించి నీరు రావడం లేని కుళాయిలును పరిశీలించారు.



ఈ సందర్భంగా గ్రామీణ త్రాగునీరు సరఫరా విభాగం జే ఈ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు అందరికీ త్రాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని, ఇంటింటికి జల్ జీవన్ మిషన్ లో కుళాయిలు వేసినా ఎందుకు నీరు రాలేదు పరిశీలించి తొందరగానే ఈ సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.అప్పలరాజు, ఎస్.గోవిందరావు,వై.ప్రసాద్. పి.సాయి కుమార్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అదనపు డి ఎం అండ్ హెచ్ ఓ ఆకస్మిక తనిఖీ

**రాజాం (మనసులో మాట)**



ప్రజారోగ్య సంరక్షణ, ప్రభుత్వ వైద్యసేవలను బలోపేతం చేయాలనే ముఖ్య ఉద్దేశ్యంతో నిబద్ధతను ప్రదర్శిస్తూ, అదనపు జిల్లా వైద్యారోగ్యశాఖధికారిణి కె. రాణి శనివారం ఆదర్శ్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అన్ని విభాగాలు ఆమె పరిశీలించారు, వైద్య మరియు సహాయక సిబ్బందితో సంభాషిస్తూ ప్రజలకు అందిస్తున్న వైద్యారోగ్య సేవలు పనితీరు, రికార్డులు నిర్వహణ, మాతా, శిశు సంరక్షణ, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులైన అధిక రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్) వారికి అందిస్తున్న సేవలు, పరిశుభ్రత పాటించడం, రోగుల సంరక్షణ, మరియు అవసరమైన ఆరోగ్య సేవలను అందించడంలో సిబ్బంది కనబరుస్తున్న అంకితభావం పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. సేవా భావంతో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలను అందించడం మరియు రోగిస్నేహపూర్వక విధానానికి గాను డాక్టర్ ఉంగా కిరణ్ కుమార్ గారిని అదనపు జిల్లా వైద్యారోగ్యశాఖాధికారిణి ప్రత్యేకంగా అభినందించారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జంప్ కృష్ణ మోహన్, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్ రావు, సత్యారావు, ఎంపీహెచ్ఓ చంద్ర శేఖర్ రాజు, ల్యాబ్ టెక్నీషియన్ జె.సింహాచలం, స్టాఫ్ నర్సులు దేవి, రామలక్ష్మి, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాంబాబు, యల్ జి ఎస్ సంతోషి కుమారి పాల్గొన్నారు.

# అగనంపూడి జడ్పీ హై స్కూల్ అభివృద్ధి పనులు



**గాజువాక (మనసులోమాట )మే 30**

అగనంపూడి హై స్కూల్ నూతన ఆధునీకరణ పనులు సందర్శించిన కుటమి నాయకులు. ఏ డి సి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రోత్సాహంతో 85 వార్డు మాజీ కార్పొరేటర్ శ్రీమతి ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్ కృషితో జివిఎంసి నిధులతో అగనంపూడి హై స్కూల్ ప్రహరీ చుట్టూ సీసీ కాలవ హై స్కూల్లో మెయిన్ గేట్ దగ్గర నుండి హెచ్ఎం ఆఫీస్ వరకు తారు రోడ్డు మరియు యోగా శిక్షణకు సీసీ ప్లాట్ఫారం నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని కార్పొరేటు పాఠశాలకు దీటుగా పాఠశాల అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారని, ప్రధానోపాధ్యాయులు ఎం కృష్ణారావు నేతృత్వంలో ఉపాధ్యాయుల బృందం ఉత్తమ బోధన తో ఇటీవల పదో తరగతి పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించారని, ఉత్తమ బోధన, అక్షయపాత్ర మిడ్ మీల్స్, ఉచిత బుక్స్ , పిల్లలకు యూనిఫారం

,స్కూల్ బ్యాగులు, షూస్, తల్లికి వందనం పథకం ద్వారా పిల్లలకు నిధులు అందజేయడం జరుగుచున్నది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యకు ,పాఠశాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని కావున ప్రభుత్వ పాఠశాల లో పిల్లల్ని చేర్చాలని కోరారు.

టిడిపి సీనియర్ నాయకులు పలక అచ్యుత్, జనసేన పార్టీ నాయకులు బుదిరెడ్డి అప్పారావు, సమాజ సేవకులు బివి సుబ్బారావు, కాంట్రాక్టర్ జాజుల తాతారావు పాల్గొన్నారు.

మనసులో మాట

# గంజాయి సమాచారం దాచడం కూడా నేరమే:

## ఎస్ఐ రామకృష్ణారావు హెచ్చరిక



**రోలుగుంట మనసులో మాట మే 30.**

అనకాపల్లి జిల్లా, రోలుగుంట మండలం (జానకిరాంపురం) పరిధిలోగల జీడిపిక్కలు కర్మాగారంలో వహించిన అవగాహన సదస్సులో గంజాయి అమ్మకాలు, రవాణా గురించి తెలిసి కూడా పోలీసులకు తెలియజేయకుండా దాచడం కూడా నేరమని రోలుగుంట ఎస్ఐ రామకృష్ణారావు స్పష్టం చేశారు. శనివారం మధ్యాహ్నం జానకిరాంపురం పరిధిలోని జీడిపిక్కల కర్మాగారంలో రోలుగుంట పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణారావు మాట్లాడుతూ, సమాజంలో మహిళలపై జరుగుతున్న నేరాలు, ఘోరాల నివారణకు మహిళలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా యువత గంజాయి మత్తుకు లోనై నేరాలకు పాల్పడుతున్న పరిస్థితిని ప్రస్తావిస్తూ, ఇటువంటి దుష్ప్రవర్తనలపై కట్టడి చేయాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు.అలాగే, సైబర్ మోసాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూ, తెలియని లింకులు క్లిక్ చేయకూడదని, వ్యక్తిగత వివరాలు ఎవరికీ పంచుకోకూడదని హెచ్చరించారు

# బత్తిలి గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్



**పార్వతీపురం మనసులో మాట,, మే 30:**

జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, నిల్వలు, విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు పోలీసులు చేపట్టిన "వజ్ర ప్రహార్" ఆపరేషన్ మరింత ఉధృతంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో శనివారం బత్తిలి గ్రామంలోని కొత్తవీధిలో భారీ స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి అనుమానితుల కదలికలపై నిఘా పెట్టారు.

ఆపరేషన్‌లో భాగంగా పోలీసులు సుమారు 50 ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేసి, 200 మంది వ్యక్తుల వివరాలను ధృవీకరించారు. గంజాయి సాగు, రవాణా, విక్రయాలు లేదా ఇతర నేర కార్యకలాపాలతో ఎవరైనా సంబంధాలు కలిగి ఉన్నారా అనే అంశాలపై ఆరా తీశారు. గ్రామంలోని యువత, స్థానిక ప్రజలతో మాట్లాడి మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

అదేవిధంగా అనుమానాస్పదంగా కనిపించిన నాలుగు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని వాటి రిజిస్ట్రేషన్, యాజమాన్య వివరాలపై విచారణ చేపట్టారు. అవసరమైన రికార్డుల పరిశీలన అనంతరం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు పోలీసులు తెలిపారు.

జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ కార్యకలాపాలకు ఏమాత్రం అవకాశం ఇవ్వబోమని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు కూడా అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై సమాచారం అందించి పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# టిడ్కో ఇళ్ల కేటాయింపులు రద్దుచేసి పేదలకు ఇవ్వాలని డిమాండ్

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



**గాజువాక (మనసులోమాట )మే 30**

ఎంపీ శ్రీభరత్ అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు గాజువాక నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్న ఈ సమావేశంలో అంశాలపై పల్లా శ్రీనివాసరావు స్పష్టమైన సూచనలు చేశారు.

**టిడ్కో ఇళ్లపై తక్షణ చర్యలు అవసరం**

ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ... టిడ్కో, రాజీవ్ గృహకల్ప పథకాల కింద కేటాయించిన అనేక ఇళ్లలో లబ్ధిదారులు ఇప్పటికీ నివాసం ఉండడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇళ్ల కేటాయింపులు జరిగి 17 నుంచి 18 సంవత్సరాలు గడిచినా, కొన్ని ఇళ్లకు ఇప్పటికీ తాళాలు కూడా వేయని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న ఇళ్లు అసాంఘిక శక్తులకు అడ్డాలుగా మారుతున్నాయని, గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు కేంద్రాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీని ప్రభావం చుట్టుపక్కల నివసిస్తున్న కుటుంబాలపై తీవ్రంగా పడుతోందని పేర్కొంటూ, ఇంతకాలం గడిచినా ఇళ్లలో నివాసం ఉండని లబ్ధిదారుల కేటాయింపులను సమీక్షించి, అవసరమైతే రద్దు చేసి అర్హులైన పేద కుటుంబాలకు తిరిగి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ అంశాన్ని గతంలో పలుమార్లు ప్రస్తావించినప్పటికీ ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోలేదని పేర్కొనగా, ఈసారి జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# ఉచిత హోమియో వైద్య శిబిరం




**విజయనగరం, మే 30 (మనసులో మాట) :**

వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని వడదెబ్బకు గురికాకుండా ముందు జాగ్రత్తగా ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని శనివారం స్థానిక కాళీఘాట్ కాలనీలో డాక్టర్ గాడి ప్రసాద్ నేతృత్వంలో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ గ్రంధాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్ ఆధ్వర్యంలో 42 వ వార్డు కార్పొరేటర్ పిన్నింటి కళావతి నేతృత్వంలో సన్ షైన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లో ఈ ఉచిత హోమియో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ స్నేహలత, డాక్టర్ తనుశ్రీలు మాట్లాడుతూ అందరూ తగినంతగా నీరు, మజ్జిగ, నిమ్మరసం వంటివి తరచుగా తాగుతుండాలన్నారు. ఆహార, విహారాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మధుమేహం, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధులున్నవారు ఇంకాస్త జాగరూకతతో మెలగాలని సూచించారు.

# 'ప్రజా దర్బార్ ' ద్వారా కర్రోతు వినతులు స్వీకరణ

- పరిష్కార దిశగా అడుగులు



**నెల్లిమర్ల, మే 30 (మనసులో మాట)**

భోగాపురం మండలం పోలిపల్లి గ్రామంలో ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ & నెల్లిమర్ల టిడిపి ఇంచార్జి కర్రోతు బంగార్రాజు తన నివాసంలో ముఖ్యమంత్రి ఆదేశానుసారం "ప్రజా దర్బార్" అనే కార్యక్రమాన్ని నిర్వహించి కార్యకర్తలు,ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

వినతులలో భూ సమస్యలు,సిసి రోడ్లు, కాలువలు, ఎలక్ట్రికల్, గత ప్రభుత్వంలో ఉపాధి కోల్పోయిన బాధితుల సమస్యలు గ్రామాల్లో మౌలిక వసతుల సమస్యలు,గత ప్రభుత్వంలో రీసర్వే వలన జరిగిన పొరపాట్లు మరియు ఎయిర్పోర్ట్ లో ఉపాధి కోసం దరఖాస్తులు మొదలగు అనేక సమస్యలను గూర్చి వినతల రూపంలో దరఖాస్తులను స్వీకరించారు.

ఈ సందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలనుసారం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని.

# అక్రమ ఇసుక తరలింపుపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని బోండా సన్నీబాబు డిమాండ్





**పెదబయలు మే 30 మనసులో మాట :**

అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం సీత గుంట గ్రామపంచాయతీ పరిధిలోగల కుమ్మరిపుట్టు పరిసర ప్రాంతాల్లో అక్రమ ఇసుక కోరి దందా అధికారుల కన్ను సైగల్లో జరుగుతున్నాయి. నేటికీ నెల రోజులుగా కుమ్మరి పుట్టు పరిసర ప్రాంతాల నుండి ఇసుక అక్రమంగా నాన్ ట్రైవ్ విచ్చేదారులు తరలిస్తుంటే అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు, ఆదివాసి ప్రాంతంలో ఇసుక, మైనింగ్, తీయాలంటే పీసా గ్రామసభ అనుమతి తప్పనిసరి అయి ఉండాలి అయినప్పటికీ పీసా గ్రామ సభ అనుమతి లేకుండా అక్రమంగా ఆదివాసి ప్రాంతాల నుండి గుత్తేదారులు ఇసుకను తరలిస్తున్నారు, అక్రమంగా ఇసుక తరలిస్తున్నటువంటి గుత్తేదారులపై సెక్షన్ 329, అండ్ 324 ఆఫ్ భారతీయ న్యాయ సన్నిహిత్, షెడ్యూల్ ఏరియాలో గిరిజనేతరులైన గుత్తేదారులు కూడా ఇసుక దందా లో ఉన్నారు, వారిపై ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ ఏరియా ట్రాన్స్ఫర్ రెగ్యులేషన్ 1959(1/70 )రెగ్యులేషన్ యాక్ట్ ప్రకారం షెడ్యూల్ ప్రాంతాల ఆదివాసి ప్రాంతాల నుండి మైనింగ్ ఇసుక తరలిస్తున్న వారిపై చట్టపరమైనటువంటి చర్యలు చేపట్టాలని పీసా ఉపాధ్యక్షులు బోండా సన్నిబాబు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఏడి మైనింగ్, పాడేరు, అల్లూరు జిల్లా కలెక్టర్ వారికి, స్థానిక తహసిల్దార్ వారికి ఫిర్యాదు చేస్తున్నట్లు బోండా సన్నీ బాబు ఒక ప్రకటన ద్వారా ప్రభుత్వానికి డిమాండ్ చేశారు ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు వెంటనే స్పందించి అక్రమ ఇసుక తరలింపును ఆపాలని ఇసుక తరలింపులో ఆ ప్రాంతంలో సాగు భూమి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించేలా చర్యలు చేపట్టాలని క్వారీ ద్వారా వచ్చేటటువంటి నిధులను స్థానిక

# నెల్లిమర్ల నగర పంచాయతీ కొత్త కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అప్పలరాజు

**నెల్లిమర్ల, మే 30, (మనసులో మాట)**



విజయనగరం నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ సి హెచ్. అప్పలరాజు నెల్లిమర్ల నగర పంచాయతీ కొత్త కమిషనర్ గా బాధ్యతలు చేపడుతూ శనివారం నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం శనివారం జీవో జారీ చేసింది. నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్‌గా పనిచేస్తున్న సైలాడ జనార్దన రావు పదవీ విరమణ పొందడంతో, ఆయన స్థానంలో అప్పలరాజుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్‌గా సుదీర్ఘ కాలం సేవలందించిన సైలాడ జనార్దన రావు శనివారం నాటితో ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా పురపాలక సంఘ కార్యాలయంలో సిబ్బంది ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన అందించిన సేవలను అధికారులు, సిబ్బంది కొనియాడారు.

# జిందాల్ మెగా ఇండస్ట్రియల్ పార్క్ శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలి

- **రాష్ట్ర పరిశ్రమల శాఖ సెక్రటరీ యువరాజ్ ఆదేశం**



**విజయనగరం, (మనసులో మాట) జిల్లా ప్రతినిధి, మే 30 :**

జిల్లాలోని ఎస్.కోట మండల పరిధిలో ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన "మెసర్స్ జేఎస్‌డబ్ల్యూ ఇండస్ట్రియల్ పార్క్ లిమిటెడ్ " (ప్రైవేట్ మెగా ఇండస్ట్రియల్ పార్క్ (మల్టీ యుటిలిటీ ఎంఎస్ఎంఈ పార్క్)) శంకుస్థాపనకు ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరితగతిన ఏర్పాట్లు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య శాఖ సెక్రటరీ డాక్టర్ ఎన్. యువరాజ్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ఆయన శనివారం అమరావతి నుంచి జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఎస్. సేధు మాధవన్ లతో నిర్వహించిన ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ లో పార్కుకు సంబంధించిన ప్రస్తుత ప్రగతి, భూసేకరణ, మౌలిక వసతుల కల్పనపై సమగ్రంగా సమీక్షించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ పార్కుకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు.

# మాజీ సర్పంచ్ మజ్జి రత్నాలమ్మకు నివాళులర్పించిన టీడీపీ ఇన్‌చార్జి దొన్నుదొర



- **రత్నలమ్మ దేహాన్ని టిడిపి జెండాను కప్పుతున్న టీడీపీ ఇన్‌చార్జి దొన్నుదొర**

**హుకుంపేట మే 30 మనసులో మాట**

మండలంలోని బాకూరు పంచాయతీ గొర్లగూడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకురాలు మజ్జి రత్నాలమ్మ అనారోగ్యంతో మృతి చెందగా, అరకు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర శనివారం గ్రామాన్ని సందర్శించి ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోసారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఈ సందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ, మజ్జి రత్నాలమ్మ మరణం ఆమె కుటుంబానికే కాకుండా తెలుగుదేశం పార్టీకి కూడా తీరని లోటని అన్నారు. మహిళలకు రాజకీయంగా గుర్తింపు, గౌరవం కల్పించడంలో తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఎన్టీఆర్ హయాంలోనూ, ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోనూ మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో రత్నాలమ్మ టీడీపీ మండల అధ్యక్షురాలిగా సేవలందించారని, గ్రామాభివృద్ధికి అంకిత భావంతో పనిచేశారని కొనియాడారు. 2014లో బాకూరు పంచాయతీ సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజలకు చేరువై సేవలందించారని గుర్తుచేశారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శతక బొంజు బాబు, మాజీ జీసీసీ చైర్మన్ చెట్టి లక్ష్మణుడు, మాజీ ఎంపీటీసీ పాడి బాలన్న, మాజీ మండల అధ్యక్షుడు కుర్ర తులసిరావు, మండల ప్రధాన కార్యదర్శి బొడ్డ శ్యామ్తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అనకాపల్లి జిల్లా రిజిస్టర్ గా భాద్యత లు చేపట్టిన ఎం.వి.రత్నకుమార్

**అనకాపల్లి ప్రతినిధి, మే 30 (మనసులో మాట ):**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ అనకాపల్లి జిల్లా రిజిస్టార్ గా ఎం. వీ. రత్నకుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక రింగ్ రోడ్ లో ఉన్న జిల్లా కార్యాలయంలో రత్నకుమార్ పదవి బాధ్యతలను చేపట్టారు. కాగా పదవీ బాధ్యతలు స్వీకరించిన రత్నకుమార్ ను రిజిస్టార్ల సంఘం నాయకులు, సీనియర్ అధికారులు బంగారు వెంకటేశ్వరరావు, అప్పారావు, గీతాలక్ష్మి, బేగం, శ్రీనివాసరావు, శ్రీకాంత్ తదితరులు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# మెగా డిఎస్సీ పై విషం కక్కడం జగన్ కి సమంజసం కాదు

- తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యానిర్వహాక కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీష్




**అనకాపల్లి ప్రతినిధి, మే 30 (మనసులో మాట ):**

నిరుద్యోగులకి ఉద్యోగాలు వస్తున్నాయన్న బాధ వైఎస్ఆర్సీపి కి ఎక్కువై పోతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యానిర్వహక కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు ఒక ప్రకటనలో అన్నారు. మరో మెగా డీఎస్సీ విడుదలకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంటే ఓర్వలేక లేనిపోని ఆరోపణలు చేస్తూ నిరుద్యోగులను వీధిన పడే విధంగా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్న వైనం ప్రజలు గమనిస్తున్నారని, డిఎస్సి కి అటెండ్ అయిన ఒక కేసుని ఆధారం చేసుకుని జగన్ రెడ్డి దుష్ప్రచారం చేయడం చూస్తుంటే నిరుద్యోగుల జీవితాలు నాశనం చేసేటట్టు ఉందన్నారు.

రాష్ట్రం అభివృద్ధి చెందుతుంటే, ప్రభుత్వం పై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ నాగ జగదీష్ , జగన్ రెడ్డి పై విరుచుకుపడ్డారు.

కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మెగా డీఎస్సీ కి ప్రభుత్వం నోటిఫికేషన్ చేస్తే కోర్టులో వివిధ వర్గాల చేత కేసులు వేయించి మెగా డీఎస్సీ అపాలని చూసారని ఆయన దుయ్యబట్టారు. కష్టపడి చదివి ఉద్యోగాల సంపాదించిన 16వేల మందికి జగన్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండు చేశారు.

# జూన్ 2వ తేదీ నుంచి శ్రీ షిర్డీ సాయిబాబా 9వ బ్రహ్మోత్సవాలు.



**విశాఖ ఎంవీపీ కాలని, మే 30, మనసులో మాట.**

రానున్న జూన్ నెల 2వ తేదీ మంగళవరం నుంచి మూడు రోజుల పాటు హనుమంతవాక జంక్షన్, విమ్స్ ఆసుపత్రి ఎదురుగా ఉన్న విశాఖ షిర్డీ సాయి సంస్థాన్ సద్గురు శ్రీశ్రీశ్రీ సాయినాథ్ మహారాజ్ వారి 9వ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ బి.వి.రమణ కుమార్ శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆరిలోవ విమ్స్ ఆసుపత్రి ఎదురుగా విశాఖ షిర్డీ సాయి సంస్థాన్ ఆలయం నిర్మించి 9సంవత్సరంలు పూర్తయిన సందర్భంగా జూన్ నెల 2వ తేదీ మంగళవారం నాడు ఉదయం ఆరున్నరకు 108 కళశాలతో శ్రీ సాయి బాబా వారికి క్షీరాభిషేకం, అనంతరం ఉదయం 9గంటలకు శ్రీ లక్ష్మీ గణపతి హోమం, సాయంత్రం 5 గంటలకు శ్రీవేదానంద సరస్వతి మహారాజ్ గారి ప్రవచనం ఉంటాయన్నారు. మరుచటి రోజు 3వ తేదీ బుధవారం నాడు ఉదయం 8 గంటలకు బ్రహ్మశ్రీ ఆకొండి సూర్య నారాయణ శాస్త్రి గారి శిష్య బృందంచే సత్సంగం, తరువాత ఉదయం 10 గంటలకు నాగభూషణ గుప్త వాటి బృందంచే భజన కార్యక్రమం ఉంటాయన్నారు. బ్రహ్మోత్సవాల చివరి రోజైన 4వ తేదీ గురువారం వేకువ జామున నాలుగున్నరకు సంకట చతుర్ధి గణపతి అభిషేకం, పూజ జరుగుతా యన్నారు. తరువాత ఉదయం 8గంటలకు ద్వారకా మయిలో సద్గురు శ్రీ సాయి బాబా వారి వ్రతం జరుగుతుం దన్నారు. అధ్బుత ఫలాల నిచ్చే ఈ దివ్య వ్రతం చేయగోరే దంపతుల వివరాలు దేవస్థానంలో ఉన్న సిబ్బందికి జూన్ 3వ తేదీ లోగా సమర్పించా లన్నారు.

అదనపు వివరాల కోసం భక్తులు 8897599998 నంబర్ను సంప్రదించాలన్నారు.

# రీ-నీట్ 2026 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు : డీఆర్వో



**విజయనగరం, (మనసులో మాట) జిల్లా ప్రతినిధి, మే 30:**

డైరెక్టర్ జనరల్, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రీ నీట్ 2026 ప్రవేశ పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లాలో పకడ్బంది ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా రెవిన్యూ అధికారి సత్తిబాబు తెలిపారు. జూన్ 21వ తేదీ (ఆదివారం) మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.15 గంటల వరకు జిల్లాలోని 7 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షకు జిల్లాలో మొత్తం 1,901 మంది విద్యార్థులు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి మాట్లాడుతూ, పరీక్షలను పారదర్శకంగా, ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష ప్రారంభానికి ముందుగానే అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మార్గదర్శకాలను తప్పనిసరిగా అమలు చేయాలని చీఫ్ సూపరింటెండెంట్లకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు తగిన ఏర్పాట్లు చేయాలని, అత్యవసర పరిస్థితుల కోసం వైద్య బృందాలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో భద్రతా చర్యలను కట్టుదిట్టం చేయడంతో పాటు, ప్రశ్నపత్రాల భద్రత, గోప్యత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు కనీసం రెండు గంటల ముందుగానే చేరుకోవాలని, అవసరమైన గుర్తింపు పత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు. విద్యార్థులు ఎలాంటి లోహ ఆభరణాలు, చెవిదిద్దులు, ఉంగరాలు, చైన్లు, గడియారాలు, బెల్టులు ధరించి రావద్దని తెలిపారు. షూస్‌కు అనుమతి లేదని, సాధారణ స్లిప్పర్లు మాత్రమే ధరించాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోకి పెన్ను, ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు, కాలిక్యులేటర్లు వంటి వస్తువులను అనుమతించరని పేర్కొన్నారు.

# ఏడువొంపులగెడ్డ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే బేబీనాయన

- కొండకెంగువ గ్రామస్తులు మరియు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆరాధించే "దేవుడుబాబు" ఆలయంలో సొంత నిధులతో అభివృద్ధి పనులు చేయించిన ఎమ్మెల్యే బేబీనాయన





**బొబ్బిలి, మే 30,(మనసులో మాట)**

బొబ్బిలి నియోజకవర్గం, రామభద్రపురం మండలంలో ఏడువొంపులగెడ్డపై ఉన్న ఆనకట్ట నిర్వహణ మరియు అనుసంధానంగా ఉన్న చెరువుల నిర్వహణకు ఓ&ఎం నిధులు రూ12 లక్షలు మంజూరు చేయించి, శాసన సభ్యులు ఆర్.వీ.ఎస్.కె.కె.రంగారావు (బేబీ నాయన) చేతుల మీదుగా పనులు ప్రారంభించడం జరిగింది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేబీనాయన మాట్లాడుతూ, ఏడువొంపులగెడ్డపై ఉన్న ఆనకట్ట నిర్వహణ లోపం వలన కనీసనిల్వ ఉండవలసిన నీరు ఉండడం లేదని అన్నారు.. అలానే, ఏడువొంపుల గెడ్డ కుడికాలువ నుంచి కంబాలచెరువు, అక్కడ నుంచి కొత్త చెరువు మరియు నిష్ఠల చెరువుకు వెళ్ళే నీటి మార్గాల మరమ్మత్తులు కూడా చేయనున్నట్లు తెలిపారు.

# ఎంపీటీసీ నిధులతో బస్ షెల్టర్ పునన్నిర్మాణం



**బుచ్చియ్యపేట, మే 30 (మనసు లో మాట):**

శిధిలమైన మండలంలోని కే పి అగ్రహారం బస్ షెల్టరు ను ఎంపీటీసీ నిధులతో పునన్నిర్మించారు. చాలా కాలం క్రితం నిర్మించిన కే పి అగ్రహారం బస్ షెల్టరు శిధిలావస్థకు చేరుకోవటంతో ప్రయాణీకులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని గమనించిన స్థానిక ఎంపీటీసీ సభ్యులు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు దేవర అప్పరావు తన ఎంపీటీసీ నిధులతో పాటు చోడవరం శాసనసభ్యులు కె ఎస్ ఎన్ ఎస్ రాజు ప్రోత్సాహంతో బస్ షెల్టరు పునన్నిర్మాణం పనులు చేపట్టారు. బస్ షెల్టరు పునన్నిర్మాణం పనులు పూర్తయ్యాయని త్వరలో చోడవరం శాసనసభ్యులు కె ఎస్ ఎన్ ఎస్ రాజు చేతుల మీదుగా ఈ బస్ షెల్టర్ ప్రారంభోత్సవాన్ని నిర్వహిస్తామని దేవర అప్పరావు శనివారం విలేఖరులకు తెలిపారు.

మనసులోమాట
KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా బర్ణులిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

# ఎమ్మెల్యే మాధవమ్మ 'ప్రజా దర్బార్'కు పోటెత్తిన అర్జీలు





- ప్రజా సమస్యల పరిష్కారమే నా ప్రధమ కర్తవ్యం ఎమ్మెల్యే

**నెల్లిమర్ల , మే 30, (మనసులో మాట)**

నెల్లిమర్ల నియోజకవర్గం ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటిని పరిష్కరించేందుకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రజలు తమ సమస్యలపై ఎమ్మెల్యే లోకం నాగమాధవి కి స్వయంగా వినతిపత్రాలు అందజేశారు .

ఈ ప్రజా దర్బార్‌లో ప్రధానంగా ఈ క్రింది సమస్యలపై ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు:

*** భోగాపురం భూసేకరణ సమస్యలు:**

భోగాపురం విమానాశ్రయం భూసేకరణకు సంబంధించి ఎదుర్కొంటున్న ఇబ్బందులను, తమకు జరగాల్సిన న్యాయాన్ని వివరిస్తూ బాధిత రైతులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

*** ఆయుష్ ఆరోగ్య మందిరాల విలీనంపై అభ్యంతరం:**

పేరాపురం, వెంపడం, సి.హెచ్.అగ్రహారం గ్రామాల్లోని ఆయుష్ ఆరోగ్య మందిరాలను (వెల్నెస్ సెంటర్స్) రెల్లివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో విలీనం చేయవద్దని, దీనివల్ల స్థానికంగా వైద్య సేవలు దూరమవుతాయని ఆయా గ్రామాల ప్రజలు కోరారు.

*** రెవెన్యూ, పెన్షన్ సమస్యలు:**

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పలు రెవెన్యూ సమస్యలను, అలాగే అర్హులైనప్పటికీ సాంకేతిక కారణాల వల్ల పెన్షన్లు అందని లబ్ధిదారులు తమకు న్యాయం చేయాలని మొర పెట్టుకున్నారు.

*** ఉపాధి, మౌలిక వసతులు:**

నియోజకవర్గంలోని యువత ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరగా, పలు గ్రామాల ప్రజలు తమ ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్ల నిర్మాణం, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు.

# కూలీలకు సైబర్ నేరాలు, మహిళా చట్టాలపై పోలీసుల అవగాహన





**గజపతినగరం మే 30 తేదీ మనసులో మాట:-**

మండల పరిధిలోని మరుపల్లి మరియు ఎం. గుమ్మడం గ్రామాలలో శనివారం ఉపాధి హామీ కూలీలతో గజపతినగరం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ సన్యాసినాయుడు మాట్లాడుతూ...ప్రస్తుత రోజుల్లో సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీలు, బ్యాంక్ వివరాలు చెప్పి మోసపోవద్దని హెచ్చరించారు. అలాగే సమాజంలో మహిళల రక్షణ, మహిళా సాధికారత ప్రాధాన్యతను వివరిస్తూ.. చట్టాలపై మహిళలకు కనీస అవగాహన ఉండాలని పేర్కొన్నారు.

# మాజీ సర్పంచ్ ను పరామర్శించిన మాజీ శాసన సభ్యులు శంబంగి

**బొబ్బిలి, మే 30,(మనసులో మాట)**

రామభద్రపురం మండలం నాయుడు వలస గ్రామంలోని నడిమింటి సత్యం సతీమణి మాజీ సర్పంచ్ నడిమింటి లక్ష్మి కి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న బొబ్బిలి మాజీ శాసనసభ్యులు శంబంగి వెంకట చిన్న అప్పలనాయుడు శనివారం నాయుడువలస గ్రామంలో లక్ష్మి నివాసానికి వెళ్లి ఆవిడను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆవిడ ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకుని మళ్లీ ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు.



ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు, వైఎస్సార్సీపీ జిల్లా అధికార ప్రతినిధి బొద్దల సత్యనారాయణ, లాయర్ రుంకాణ ప్రసాదరావు మరియు కార్యకర్తలు ఉన్నారు

# పొగాకు కు వ్యతిరేకంగా ర్యాలీ



**పొలాకి, మే, 30:మనసులో మాట :**

మే 31 ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఏ పీ వి హెచ్ ఏ గుంటూరు వారి సౌజన్యం తో, పాలకొండ కు చెందిన జన చేతన సంస్థ ఆధ్వర్యం లో శనివారం శ్రీకాకుళం జిల్లా పోలాకి మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో "ప్రాణాలను పీల్చేస్తున్న పొగాకు" మరియు 2026 సంవత్సరం అంశం పై "నికోటిన్, పొగాకు ఆకర్షణ ముసుగును తొలగిద్దాం పొగాకు వ్యసనాన్ని అరికడదాం" అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది. ముందుగా హాజరైన వారితో "పొగ త్రాగవద్దు కాన్సర్ కి గురి కావద్దు" "సిగరెట్ పొగ జీవితానికి సెగ" "పొగ త్రాగడం ఆరోగ్యానికి హానికరం" "ధూమపానం కాన్సర్ కి కారకం" "పొగాగుకు దూరంగా ఉందాం నికోటిన్ వ్యాధిని అరికడదాం" లాంటి చైతన్య పరిచే నినాదాలు తో ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం స్థానిక కేంద్రం వైద్యులు డా. సుమ ప్రియ, డా. శ్రీనాధ్ కుమార్ లు మాట్లాడుతూ పొగాకు రహిత సమాజం కోసం మనం పాటించాల్సిన నియమాలు, ఉత్తమ మార్గాలు,ధూమపానం, పొగాకు వల్ల కలిగే ఇబ్బందులు, పర్యావరణంపై ప్రభావం, పేదరికానికి కారణాలు మొదలైన అంశాలపై మాట్లాడడం జరిగింది. జన చేతన కోఆర్డినేటర్ పండిత వెంకట పాణి గ్రాహి మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు అయిన చుట్ట, బీడీ, సిగరెట్, గుట్కా, జరద, నస్యం , ఖైనీ, హుక్కా మొదలైనవి పీల్చడం,నమలడం అనే అలవాటు క్రమేపీ తప్పనిసరి వ్యసనంగా మారి ప్రాణాంతక వ్యాధులకు గురి చేస్తుందని అన్నారు. ఎం పీ హెచ్ ఈ ఓ ఎన్. రవికుమార్, ఎం. శేఖరబాబు లు మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల్లో ఉండే నికోటిన్ చాలా ప్రమాదరమైనవి, క్యాన్సర్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులకు గురిచేస్తుంది, వాటి జోలికి పోకూడదని హితవు పలికారు.

ఈ కార్యక్రమం లో జన చేతన కోఆర్డినేటర్ పీ వి పాణిగ్రాహి, సచివాలయం సెక్రటరీ కె.చంద్రరావు, వి ఆర్ ఓ ఆర్. రాంబాబు, వెల్ఫేర్ అసిస్టెంట్ పి. అప్పల నాయుడు, మహిళా పోలీస్ కె. ప్రశాంతి, ఏ ఎన్ ఎం కె. తులసీలక్ష్మి, ఇతర సిబ్బంది డి. ఢిల్లేశ్వర రావు, కె. జగన్నాధరావు, కె. హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

# పంటల ధరలు పెంచండి ప్రాజెక్టులకు నిధులు కేటాయించండి



**పాలకొండ, మే30,మనసులోమాట :**

పాలకొండ సిఐటియు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బంటు దాసు, అభ్యుదయ రైతు సంఘం సీనియర్ నాయకులు ఖండాపు ప్రసాద రావు మాట్లాడుతూ 2026 27 బడ్జెట్లో పార్వతీపురం మన్యం జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం రూపాయి కూడా కేటాయించలేదని ఎందుకు మా జిల్లాకు అన్యాయం చేస్తున్నారని చంద్రబాబును నిలదీయకపోగా అధికారులే జిల్లాకు అన్యాయం చేస్తున్నట్టు జిల్లా ఎమ్మెల్యేలు రంకె లు వేస్తున్నారు అన్నారు. ఇది రైతు ప్రజల ప్రభుత్వం కాదు కార్పొరేట్లకు వేల కోట్లు విలువచేసే ప్రజల భూమి దఖలు పరచడం రాయితీలు ఇవ్వడమే చంద్రబాబు పని 100 రోజుల్లో భూ సర్వే లోపాలు సరిచేస్తామని రైతులకు ఉత్తుత్తి కబుర్లు చెప్పి మోసం చేయడమే రివాజ్ గత ఐదేళ్లు ఇప్పుడు రెండేళ్లు అధికారం వెలగబెట్టిన చంద్రబాబు నాయుడు తోటపల్లి,

పెద్ద గడ్డ నిర్వాసితులు పునరావాసానికి రూపాయి ఇవ్వలేదు మోసం చేయడం వారి వంతు మోసపోవడం మన వంతు కారాదని అన్నారు.

## జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో క్రీడాకారుల సత్తా



**పార్వతీపురం మనసులో మాట , మే 30:**

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాలు యువ క్రీడాకారుల ప్రతిభకు వేదికగా నిలిచాయి. శిబిరాల ముగింపు సందర్భంగా ఆఫీసర్స్ క్లబ్‌లోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో అండర్ 12, అండర్ 14, అండర్ 16 బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు విజేతలుగా నిలిచి ప్రశంసలు అందుకున్నారు. టోర్నమెంట్ సందర్భంగా జరిగిన పోటీలు ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగగా, క్రీడాకారుల ఆటతీరు ప్రేక్షకులను ఆకట్టుకుంది.

**విజేతల వివరాలు:**

**అండర్-10 విభాగం:**

బాలురు: కుశ్వంత్ విజేతగా నిలవగా, వరుణ్ సందీప్ రన్నరప్‌గా నిలిచాడు.

బాలికలు: సమీక్ష నాయుడు విజేతగా నిలవగా, వేద సాహితి రన్నరప్‌గా నిలిచింది.

**అండర్-12 విభాగం:**

బాలురు: జితేంద్ర సాయి విజేతగా నిలవగా, సర్జిత్ రన్నరప్‌గా నిలిచాడు.

బాలికలు: రోషిత సాన్వి విజేతగా నిలవగా, మోక్ష రన్నరప్‌గా నిలిచింది.

**అండర్-14 విభాగం:**

బాలురు: శశాంక్ విజేతగా నిలవగా, కుశాల్ రన్నరప్‌గా నిలిచాడు. బాలికలు: పూజిత విజేతగా నిలవగా, రామలక్ష్మి రన్నరప్‌గా నిలిచింది.

**అండర్-16 విభాగం:**

బాలురు: భరద్వాజ్ విజేతగా నిలవగా, పవన్ సాయి రన్నరప్‌గా నిలిచాడు.

## వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే బేబీనాయన



- **ఎరువుల కార్డుపై రైతులకు అవగాహన.**
- **ఈ-పంట నమోదు.**
- **ఖరీఫ్ కు కావలసిన విత్తనాల సరఫరా.**

**బొబ్బిలి, మే 30,(మనసులో మాట)**

బొబ్బిలి నియోజకవర్గ వ్యవసాయశాఖ అధికారులతో శనివారం బొబ్బిలి కోటలో శాసనసభ్యులు ఆర్.వీ.ఎస్.కె.కె. రంగారావు (బేబీ నాయన) సమీక్ష నిర్వహించి, పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇవ్వబోయే ఎరువుల కార్డుపై కొందరు రైతులకు ఉన్న అనుమానాలను తొలగించేలా నాలుగు మండలాల వ్యవసాయశాఖ అధికారులు ప్రతి గ్రామంలో రైతులకు (ఉదా: అవసరమైన రైతులకు మోతాదు ప్రకారం ఎరువులు ఇస్తారని) అవగాహన కల్పించాలని సూచించారు. అలానే, ఈపంట నమోదు కూడా క్రమం తప్పకుండా జరిగేలా చూడాలని మరియు ఖరీఫ్ సీజన్ కు కావలసిన విత్తనాలను సమకూర్చుకుని, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

# గిరిజనులపై అన్యాయం జరిగితే ఊరుకోం

### -టిడిపి ఇన్చార్జి సియ్యారి దొన్ను దొర హెచ్చరిక

- **ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న హక్కులు చట్టాలనుఅధికారులు గౌరవించాలి.**
- **ప్రభుత్వ భూములను పరాయిపాలు చేస్తే రెవిన్యూ అధికారులకు కఠిన చర్యలు తప్పవు! టీడీపీ ఇంచార్జి సియ్యారి దొన్ను దొర.**
- **వివాద స్థలాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ దొన్నుదొర.**



**హుకుంపేట మే 30 మనసులో మాట**

ఏజెన్సీ ప్రాంతంలో సర్వహక్కులు కలిగిన గిరిజనుల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తే సహించేది లేదని, 1/70 చట్టానికి విరుద్ధంగా ఎవరైనా చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ అరకు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ డాక్టర్ సియ్యారి దొన్ను దొర హెచ్చరించారు. శనివారం హుకుంపేట మండల కేంద్రంలో పర్యటించిన ఆయన, గిరిజనుల భూములు, స్థలాలకు సంబంధించిన వివాదాలు మరియు అధికారుల వ్యవహారశైలిపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో వివాదాస్పద ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల భూములు, ఆస్తుల రక్షణ కోసం అమలులో ఉన్న 1/70 భూ బదలాయింపు నియంత్రణ చట్టంను అధికారులు, ఇతరులు తప్పనిసరిగా గౌరవించాలని అన్నారు. గిరిజనుల హక్కులకు భంగం కలిగించే విధంగా లేదా చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

రెవెన్యూ అధికారుల ఏకపక్ష వైఖరిని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. గిరిజనులను మాత్రమే లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు.

## భాజపా సంస్థాగత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

### :-బీజేపీ జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్





**గాజువాక (మనసులోమాట )మే 30**

పండిత్ దీన్ దయాళ్ ఉపాద్యాయ ప్రశిక్షణా మహా అభియాన్ తరగతులు కూర్మన్నపాలెం లోని దామా కన్వెన్షన్ లో ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పార్టీ జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి(సంస్థాగత) శివప్రకాశ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ తరగతులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని మూడేళ్లకోసారి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ముఖ్యంగా పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన సమగ్ర మానవతావాదం,అంత్యోదయ సిద్ధాంతాలపై అవగాహన కల్పించడం ,పార్టీ కార్యకర్తలకు బూత్ నిర్వహణ, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడం, సోషల్ మీడియా , సంస్థాగత బాధ్యతలపై శిక్షణ అందించడంతోపాటు కార్యకర్తల్లో క్రమశిక్షణ దేశభక్తి సేవా భావాన్ని పెంపొందించే దిశలో, పార్టీ విస్తరణ కోసం తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.దేశ రక్షణే మొదటి కర్తవ్యంగా భావించి ప్రధాని ఎన్నో కార్యక్రమాలు విజయ వంతం చేస్తున్నారన్నారు.

## క్రీడలు తోనే పిల్లలకు ఆరోగ్యం : మాజీ కార్పొరేటర్ జగన్



**గాజువాక (మనసులోమాట )మే 30**

క్రీడాలతోనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారానికి మాజీ కార్పొరేటర్ బొండా జగన్నాథం (జగన్) అన్నారు.గాజువాక నియోజకవర్గం 87వ వార్డ్ పరిధి కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిల్లలకు వేసవి శిబిరం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ వార్డ్ కార్పొరేటర్ బొండా జగన్నాథం (జగన్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధులు మాట్లాడుతూ పిల్లలు సెల్ ఫోన్లకు, చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉంచాలని ఒక మంచి ఆలోచనలో భాగంగా ఈ వేసవి శిబిరం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసి, వారికి పౌష్టికాహారం కూడా అందిస్తుందని ఇంత మంచి కార్యక్రమంలో నన్ను భాగస్వామ్యం చేసిన వారికి ధన్యవాదములు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు విజయరామరాజు, సెక్రెటరీ బొట్టా ప్రకాష్, వర్రే రాంబాబు, ఆనంద్ కుమార్, కడుపుట్ల శ్రీను, గణేష్, కోచ్ వెంకట్ పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా ఐశ్వర్యం.. సంచలన తెలుగు దిన పత్రిక

# ప్రభుత్వం జీవో నెంబర్ 30 ని వెంటనే ఉపసంహరించుకోవాలి





- **ఎమ్మెల్యే మాధవికి వందలాదిమంది రైతులు, మహిళలు సంతకాలు చేసి అందజేసిన వినతి పత్రం**

**నెల్లిమర్ల , మే 30, (మనసులో మాట)**

భోగాపురం మండల పరిధిలోని వ్యవసాయ భూముల సేకరణ కోసం ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో నెంబర్ 30 ను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరుతూ, ఇది వరకే ఈ గ్రామాలు అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయం కు భూములు ఇచ్చి ఉన్నామని మరల ఇప్పుడూ ఈ డేటా సెంటర్ కు భూములు ఇవ్వడానికి సిద్ధంగా లేమని భోగాపురం పంచాయితీ మరియు దాని అనుబంధ గ్రామాలకు చెందిన వ్యవసాయ రైతులు, రైతు కూలీలు శనివారం నెల్లిమర్ల నియోజకవర్గ శాసనసభ్యురాలు లోకం నాగ మాధవిని వారి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో కలిసి ఒక భారీ వినతి పత్రాన్ని సమర్పించారు.

ఈ సందర్భంగా ప్రజా దర్బార్‌కు తరలివచ్చిన రైతులు తమ ఆవేదనను వ్యక్తపరుస్తూ, భోగాపురం పూర్తిగా వ్యవసాయాధారిత గ్రామమని, తరతరాలుగా తమ పూర్వీకుల నుంచి వస్తున్న భూములను నమ్ముకుని, వ్యవసాయమే ప్రధాన వృత్తిగా తాము జీవిస్తున్నామని ఎమ్మెల్యే కి వివరించారు. ప్రభుత్వం అభివృద్ధి పేరుతో సుమారు 854 ఎకరాల వ్యవసాయ భూములను "డేటా సెంటర్" ఏర్పాటు కోసం సేకరించాలని జీవో 30 విడుదల చేయడం వల్ల తామంతా తీవ్ర మనోవేదనకు, ఆందోళనకు గురవుతున్నామని వారు పేర్కొన్నారు. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమంలో భోగాపురం ప్రాంతానికి చెందిన వందలాది మంది వ్యవసాయ రైతులు, మహిళలు మరియు రైతు కూలీలు పాల్గొని సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యే గారికి అందజేశారు.

# హుకుంపేట సంతలో సైబర్ క్రైమ్ అవగాహన కల్పించిన పోలీసులు



**హుకుంపేట మే 30 మనసులో మాట**

హుకుంపేట మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన వారపు సంతలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) ఎస్. విజయ్ కుమార్ నేతృత్వంలో ప్రజలకు సైబర్ క్రైమ్స్, మహిళలపై నేరాలు హెల్మెట్ వినియోగం-రోడ్డు భద్రత, పోక్సో చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా సీఐ విజయ్ కుమార్ మాట్లాడుతూ, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తెలియని లింకులు, ఫోన్ కాల్స్, ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఇతరులకు వెల్లడించవద్దని సూచించారు. మహిళల భద్రతకు సంబంధించి ప్రభుత్వం, పోలీసు శాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణలో హెల్మెట్ కీలక పాత్ర పోషిస్తుందని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే చిన్నారులపై లైంగిక వేధింపులు, దాడులను అరికట్టేందుకు అమలులో ఉన్న పోక్సో చట్టం గురించి వివరించి, అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఎస్సై దుర్గ ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొని ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తూ అవగాహన కల్పించారు. వారపు సంతకు వచ్చిన వ్యాపారులు, ప్రజలు కార్యక్రమంలో పాల్గొని పోలీసుల సూచనలను ఆసక్తిగా విన్నారు.

# పథకాలెన్నో ప్రవేశపెట్టిన జగన్మోహన్ రెడ్డి హాయం లోనే మహిళలకు మేలు

- **మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బొడ్డేడ దుర్గ లక్ష్మి**

**అనకాపల్లి ప్రతినిధి, మే 30 (మనసు లో మాట ):**



గతంలో ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి మహిళలకు ఎంతో మేలు చేకూర్చారని మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బొడ్డేడ దుర్గ లక్ష్మి, 81 వ వార్డు వైఎస్ఆర్సీపి మహిళా అధ్యక్షురాలు సుధా అన్నారు. అనకాపల్లి లో శనివారం రాష్ట్ర గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ కార్యాలయం లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో దుర్గ లక్ష్మి, సుధా మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం లో మహిళలు కు ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టి ఆర్థిక సహకారం అందించారన్నారు. డ్వాక్రా రుణాలు మాఫీ చేసి మహిళలకు ఎంతో మేలు చేసారన్నారు. అమ్మఒడి పథకం తో పిల్లల తల్లిదండ్రులుకు 15000 రూపాయలు అందజేసి ఇచ్చిన మాట నిలబెట్టు కున్నారన్నారు.81 వ వార్డు వైఎస్ఆర్సీపి ఇంచార్జి బొడ్డేడ శివ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా వైఎస్ఆర్సీపి అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ అదేశాలు నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త మలసాల భరత్ సూచనలతో ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు

# గోవా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే అదితి గజపతి



**విజయనగరం, మే 30 (మనసులో మాట) :**

గోవా రాష్ట్ర 40వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు శనివారం లోక్ భవన్ లో భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ కు ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. ప్రత్యేక విందులో గోవా ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్ తో పాటు విజయనగరం శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు పాల్గొన్నారు.

# గొల్ల వాని చెరువు పనులు పరిశీలించి న ఏ. పి. ఓ. కే. సాయిరాం

**బొబ్బిలి, మే 30,(మనసులో మాట)**




కోడూరు గ్రామ పంచాయతీ లో రామచంద్ర పురం లో గొల్ల వాని చెరువు ఉపాధి పనిని ఏ. పి. ఓ. కే. సాయిరాం శనివారం పరిశీలించారు. ఈ చెరువు లో 112 మంది పని చేస్తున్నారు.. పని ప్రదేశం లో చలువ పందిరిలు, ప్రథమ చికిత్స పెట్టే, ఓ. ఆర్. ఎస్. లు, మట్టి కుండ తో నీరు తీసుకురావాలని తెలియచేసారు. వాటర్ బెల్ లేదా విజిల్ కచ్చితంగా వేయాలని ప్రతి అరగంట కు నీరు త్రాగాలని చూసించారు.. కొలతలు ప్రకారం పని చేయాలనీ తెలియచేసారు.. ఏ. పి. ఓ. సాయిరాం తో పాటు, టెకినికల్ అసిస్టెంట్ శంకర్ రావు, ఫీల్డ్ అసిస్టెంట్ పాపయ్య, మేట్లు పాల్గొన్నారు.

# కొండగుంపాం ఘనంగా 'ఋతుస్రావ పరిశుభ్రత', 'ప్రపంచ పొగాకు వ్యతిరేక' దినోత్సవాలు





- **బాలికలు, మహిళలు ఆరోగ్య సూత్రాలు పాటించాలి**
- **ఎంఎల్ హెచ్‌ఓ భాగ్యలక్ష్మి**

**నెల్లిమర్ల, మే 30, (మనసులో మాట)**

మండలంలోని కొండగుంపాం గ్రామంలో శనివారం ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలో 'ఋతుస్రావ పరిశుభ్రత దినోత్సవం', 'ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం' కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఎంఎల్ హెచ్‌ఓ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన బాలికలు, మహిళలకు ఆరోగ్య సంరక్షణపై విస్తృత అవగాహన కల్పించారు.

**ఋతుస్రావ సమయంలో పరిశుభ్రత ప్రాణాధారం..**

ఈ సందర్భంగా ఎంఎల్ హెచ్‌ఓ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. బాలికలు, మహిళలు తమ జీవితంలో అత్యంత కీలకమైన ఋతుస్రావ (నెలసరి) సమయంలో పరిశుభ్రత పాటించాలని పిలుపునిచ్చారు. పాత బట్టలు (క్లాత్) వాడటం వల్ల ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉందని, కాబట్టి వాటి స్థానంలో విధిగా శానిటరీ ప్యాడ్స్ మాత్రమే వినియోగించాలని సూచించారు. ప్యాడ్స్ మార్చే ముందు, మార్చిన తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని (హ్యాండ్ వాష్), ప్రతిరోజూ క్రమం తప్పకుండా స్నానం చేస్తూ శరీరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె అవగాహన కల్పించారు.

**పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండండి..**

అదేవిధంగా, సమాజానికి హానికరంగా మారిన పొగాకు వినియోగంపై ఆమె తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పొగాకు ఉత్పత్తుల వాడకం అత్యంత ప్రాణాంతకమని హెచ్చరించారు.

# పాల డబ్బాల వితరణ



**డుంబ్రిగుడ, మే 30 మనసులో మాట:**

తల్లిపాలకు దూరమైన అయిదు నెలల శిశువుకు యూనిటీ ఫర్ ఛారిటీ సంస్థ ఔదర్యాన్ని చాటించి పాలడబ్బాలను వితరణ చేసి అదుకున్నారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ తల్లిపాలకు దూరమైన బాధిత కుటుంబంపై సంస్థ దృష్టికి తీసుకెళ్లారు. సంస్థ ప్రతినిధులు నీలి నారాయణ, జోస్పిన్ స్పందించి బాధిత కుటుంబానికి పాలడబ్బాలను వితరణ చేశారు. శిశువుకు బలన్నిచ్చే పాలడబ్బాలను ప్రతినెల అందిస్తామని వారన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో విద్య, ఆరోగ్యంపై దృష్టిసారించి సంస్థ సేవలు అందించడం అభినందనీయమని ఆయన అన్నారు. బాధిత శిశువు తండ్రి రాజుకుమార్, శాంతి, అప్పారావు, లలిత తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో ఆదివాసులకు తీవ్ర అన్యాయం

- **గిరిజన వికాసం పై ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రకటన హాస్యాస్పదం**



**అరకులోయ, మే 30 (మనసులో మాట):**

2024 ఎన్నికల హామీ అమలులో ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని గిరిజన వ్యతిరేక వైతిరిని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి పి అప్పలనర్స తీవ్రంగా ఖండించారు. అరకులోయ లో గల గిరిజన సంఘం కార్యాలయంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి పి అప్పలనర్స నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత రెండేళ్లలో ఆంధ్రప్రదేశ్లో కూటమి ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధి, భూ హక్కులు, సంక్షేమం విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఎన్నికల ముందు హామీలన్నీ మరిచిపోయి గిరిజన ప్రాంతాలను కార్పోట్ బడా సంస్థలకు అప్పగించే విధానాలను అమలు చేస్తుందని ఇది స్పష్టమైన ఆదివాసి వ్యతిరేక వైఖరి అన్నారు. అంతేకాకుండా గత రెండేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసులకు పోడు భూమి హక్కు పత్రాలు ఇవ్వకుండా నిరాకరించారన్నారు. అర్హత కలిగిన వారు వేలాదిమంది ఉంటే ఒక్కరిని కూడా హక్కు పత్రాలు ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. గిరిజనులకు ఇవ్వవలసిన పోడు భూమి పట్టాలు ఇవ్వకుండా ఆలస్యం చేయడం అటవీ భూములను మైనింగ్ కంపెనీ హైడ్రోపవర్ పేరిట కార్పొరేట్ కంపెనీ జరుగుతుందని 1/70 చట్టం ఆధ్వర్యంలో గిరిజనుల భూములను పరిరక్షించాల్సిన ప్రభుత్వం వాటిని బలహీన పరిచే ఆలోచనసరిఅయిందికాదన్నారు.

**గిరిజన సబ్ ప్లాన్ నిధులు దుర్వినియోగం**

గిరిజనుల జనాభా నిష్పత్తి ప్రకారం కేటాయించాల్సిన 18 వేల కోట్లకు గాను కేవలం నాలుగు వేల కోట్లు కేటాయించడం ఏమిటని కూటమి ప్రభుత్వాన్ని అప్పల నర్స నిలదీశారు.

- ఉద్యోగాలు మరియు రిజర్వేషన్ల ఉల్లంఘన
- ఆరోగ్యం, విద్య మరియు మౌలిక సదుపాయాలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- ఆదివాసి ప్రాంతంలో మైనింగ్ మరియు పర్యావరణం నిలువు దోపిడి

# కౌలు రైతులు పత్రాలు పంపిణీ చేసిన జెడి రామారావు

**గజపతినగరం మే 30 తేదీ మనసులో మాట:-**





రానున్న ఖరీఫ్ సీజన్ దృష్టిలో పెట్టుకుని రైతులు, కౌలు రైతులకు యూరియా కార్డులతో పాటు, సిసిఆర్సి కార్డులను జెడి రామారావు పంపిణీ చేశారు. శనివారం మండలంలో కొనిస, కొత్తబగ్గం రైతు సేవ కేంద్రాల పరిధిలో జిల్లా వ్యవసాయ అధికారి వీటి రామారావు, ఏ డి ఏ గాలి శ్రీనివాస్, ఏవో కిరణ్ కుమార్ రైతులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి వర్షాభావ పరిస్థితులు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా నవధాన్యాలు రాయితీపై పలువురు రైతులకు పంపిణీ చేశారు. అనంతరం జెడి వి టి రామారావు మాట్లాడుతూ... మండలంలో ఉన్న అన్ని రైతు సేవా కేంద్రాలలో పచ్చి రొట్టె ఎరువులు, వరి విత్తనాలు అందుబాటులోకి తీసుకుని వచ్చామని, వర్షా బావ పరిస్థితి దృశ్య ప్రతి ఒక్క రైతు కూడా నవధాన్యాలు విత్తనాలు తొలకరి జల్లు పడగానే చల్లుకోవాలని సూచించారు. రాయితీపై ఎంటి యు 1121 వరి విత్తనాలు జూన్ నెల మొదటి వారం తర్వాత పంపిణీ చేస్తామని తెలిపారు. వరి విత్తనాల శుద్ధి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చేసుకోవాలని కోరారు. వరి విత్తనాలు సుడోమోనస్ 250 గ్రాములు ఒక ఎకరాకి ఉపయోగించి 30 కేజీలు విత్తనాలకు శుద్ధి చేసుకోవాలని కోరారు. సుడోమోనోస్ విత్తన రేటుకు అదనంగా 40 రూపాయలు చెల్లించి రైతు సేవా కేంద్రాల వద్ద వ్యవసాయ సహాయకులు నుండి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి రాజేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు దేవుడు, మస్తాన్, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

# పంపిణీకి సిద్ధంగా వరి విత్తనాలు

**డుంబ్రిగుడ, మే 30 మనసులో మాట:**



గిరిజన వ్యవసాయ అభివృద్దే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ఖరిఫ్కు ముందే వరి విత్తనాల పంపిణీకి శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వ ప్రభుతంవ హయంలో జూలై ఆగష్టు నెలల్లో విత్తనాల పంపిణీ చేస్తుండడంతో సకాలంలో విత్తనాలు పొందలేక వారపు సంతలను వేదికగా చేసుకుని గిరిజన రైతులు విత్తనాలు స్వయంగా కొనుగోలు చేసి పంట పండించేవారు గత రెండేళ్ల నుంచి కూటమి ప్రభుత్వం చొరవతో వ్యవసాయ సీజన్కు ముందే విత్తనాల పంపిణీకి చర్యలు చేపడుతోంది. మండల వ్యాప్తంగా 15 రైతు సేవా కేంద్రాలుండగా 850క్వింటాళ్ల ఆరు రకాల విత్తనాల సరఫరాకు చర్యలు చేపట్టింది. ప్రస్తుతానికి ఏడు రైతు సేవా కేంద్రాలకు వరి విత్తనాలే చేరగా, మిగిలిన కేంద్రాల్లో రెండు రోజుల్లో సరఫరా కానుంది.